

# వేమన్న వేదం

రసార్ద్రమైన
**ఆరుద్ర**
వ్యాఖ్యానం

# వేమన్న వేదం

ప్రజాకవి వేమన పద్యాలకు

రసార్ద్రమైన వ్యాఖ్యానం

**40 సూక్తములు : ఒక మండలం**


వ్యాఖ్యాత

## ఆరుద్ర



సాహితీప్రియులు, మా యువభారతి జీవిత సభ్యులు

**శ్రీ పత్రి అశ్వనీకుమార్** గారి

ఆర్థిక సహకారంతో ముద్రితము

**ప్రచురణ**

యువభారతి

**సాహితీ సాంస్కృతిక సంస్థ**

**ఆంధ్ర సారస్వత పరిషత్ భవనములు**

**తిలక్‌రోడ్, హైదరాబాదు - 500 001**

# VEMANNA VEDAM

SELECTED POEMS OF VEMANNA
WITH A COMMENTARY BY

**Sri Arudra**

© YUVABHARATHI, AS PARISHAT BUILDING, HYDERABAD.

యువభారతి

ప్రచురణ : 20

ప్రథమ ముద్రణ : 10,200 ప్రతులు, ఉగాది 1974
ద్వితీయ ముద్రణ: 5,200 ప్రతులు, విజయదశమి, 1974
తృతీయ ముద్రణ: 2,200 ప్రతులు, 1, జనవరి 1981
చతుర్థ ముద్రణ : 1,000 ప్రతులు, కృష్ణాష్టమి 2010

ముఖపత్ర రచన :
**శీలా వీర్రాజు**

ముద్రణ :
**కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్,**
40, ఎపిహెచ్‌బి, విద్యానగర్, హైదరాబాద్-44
ఫోన్: 040-27618261

ప్రతులకు :
యువభారతి
ఆంధ్ర సారస్వత పరిషత్ భవనములు
తిలక్‌రోడ్, హైదరాబాదు - 500 001.

నవయుగ బుక్ హౌస్, సుల్తాన్‌బజార్, హైదరాబాద్ - 1
విశాలాంధ్ర బుక్ హౌస్, అబిడ్స్, హైదరాబాద్ - 1

వెల : రూ. 20/-

# మా మాట

సమాజ శ్రేయస్సుకు సమున్నత ప్రమాణాలు గల సాహిత్యం రావాలి. వాటిని పెంచి పోషించే సహృదయలోకం ముందుకు రావాలి. వారిలో చైతన్యం కలిగించడానికి సాహితీ సాంస్కృతిక సంస్థలు పూనుకోవాలి. ఈ లక్ష్యసాధనతో ఆవిర్భవించిన సంస్థ యువభారతి.

"చుట్టూరా ఆవరించుకొనివున్న చీకటిని తిట్టుకుంటూ కూర్చోవడం కంటే ప్రయత్నించి ఎంత చిన్న దీపాన్నైనా వెలిగించడం మంచిది" అన్న వాక్యమే యువభారతికి ఊపిరి పోసింది. యువభారతి 1963లో విజయదశమినాడు పుట్టింది. ఈ 47 సంవత్సరాలలో 176 పుస్తకాలు ప్రచురించింది. అందులో సాహిత్య లహరులు, కవితావైభవాలు, రచన, మహతి, యువత వంటి వ్యాస సంపుటులు, పరిశోధనా వ్యాససంపుటులు, కథా కవితా సంకలనాలూ ఉన్నాయి. ఇవి కాక గోష్ఠులు, సదస్సులు, సాహితీ సమాలోచన కార్యక్రమాలు నిర్వహించింది.

ఇప్పుడు యువభారతి ప్రతినెల ముఖ్యంగా యువకుల కోసం మూడు కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. ప్రతి నెల మొదటి ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ వారి సౌజన్యంతో ఉచిత వ్యక్తిత్వ వికాస కార్యక్రమమును యువభారతి సమావేశకర్త ఆచార్య వంగపల్లి విశ్వనాథం గారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నది. ప్రతినెల మూడవ శనివారం సాయంత్రం 6.30 గం॥లకు సాధన సాహితీ స్రవంతి, మానస ఆర్ట్ థియేటర్స్, తెలుగురథం సంస్థలతో కలిసి శ్రీ త్యాగరాయ గానసభ వారి సౌజన్యంతో 'అక్షర' సాహితీ సమాలోచన కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. ఇందులో 'నా జీవిత ప్రస్థానం' పేర ఒక ప్రముఖ వ్యక్తి యొక్క జీవిత పరిచయం మరియు 'నాకు నచ్చిన పుస్తకం' అనే శీర్షికన ఒక ప్రసిద్ధ పుస్తక పరిచయం విషయాలపై ఇద్దరు ప్రముఖ వ్యక్తుల ప్రసంగాలుంటాయి. వర్ధమాన కవుల కవితాపఠనం కూడా ఉంటుంది. ప్రతినెలా మూడవ ఆదివారం మధ్యాహ్నం 2 గం॥ల నుండి 5 గంటలవరకు శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం, సుల్తాన్ బజార్ వారి సౌజన్యంతో 'ప్రతిభ' అనే సాహిత్య వ్యక్తిత్వ నిర్మాణాత్మక కార్యక్రమాన్ని (ఆలోచించడం, మాట్లాడడం, చదవడం, రాయడం) నిర్వహిస్తోంది. ఇవిగాక ఆచార్య దివాకర్ల వేంకటావధాని గారి జయంతి, మా పూర్వాధ్యక్షులు డా. ఇరివెంటి కృష్ణమూర్తి గారి జయంతి వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉంది యువభారతి. సహృదయుల సహకార, ప్రోత్సాహాలే మూల బలంగా కొనసాగుతున్నాయి యువభారతి కార్యక్రమాలు.

వేదం విజ్ఞానప్రదమైనది. సమాజానికి సమ్యక్‌దృక్పథాన్ని నిర్దేశిస్తుంది. మానవునిలో సత్ప్రవర్తన పెంపొందించడానికి, ఉదాత్తమైన సంస్కృతిని నెలకొల్పడానికి తోడ్పడుతుంది. ఆర్షవేదం సంస్కృత పండితులకే పరిమితమైనదని పలువురి అభిప్రాయం.

వేమన్నవేదం అందరి వేదం. సామాన్యులకు సైతం అందుబాటులో ఉన్నవేదం. ఆధునిక వేదం. తెలుగువేదం. వేమన్న తనకు తాను చెప్పుకున్న వేదం. అందరు తెలుసుకోవలసిన వేదం. కార్యాచరణకు మార్గనిర్దేశనం చేసిన వేదం. సమాజశ్రేయస్సు కోరిన వేదం.

లోకంలోని నిత్యసత్యాలను పద్యాలరూపంలో ప్రకటించినవాడు వేమన. వర్ణవ్యవస్థను వ్యతిరేకించినవాడు వేమన. మూఢనమ్మకాలను నిరసించినవాడు వేమన. దురాచారాలను ఖండించినవాడు వేమన. నిజమైన జీవితతత్త్వాన్ని తెలిపినవాడు వేమన. ఆధునిక గృహస్థ ధర్మాలను తెలిపినవాడు వేమన. జీవిత పరమార్థాన్ని తెలియజేసినవాడు వేమన. వ్యక్తిత్వ వికాస మర్మాలను విదితం చేసినవాడు వేమన. ఆర్థిక వ్యవస్థలోని మూలసూత్రాలపై ఆకళింపు కలుగజేసినవాడు వేమన. ఉన్నతులను, అల్పులను సమీక్షించినవాడు వేమన. నీతిని బోధించినవాడు వేమన. సద్గుణాలను వ్యక్తపరచినవాడు వేమన. మానవత్వాన్ని మేలుకొలిపిన వాడు వేమన. ఐకమత్యాన్ని ప్రబోధించినవాడు వేమన. అందుకే వేమన పద్యం రాని తెలుగువాడు ఉండడు. అందుకే ప్రపంచంలోని చాలా భాషల్లోకి అనువదింపబడ్డాయి వేమనపద్యాలు. ఉత్తమ సమాజ నిర్మాణానికి తన అనుయాయులకు విధించిన ఏడు సూత్రాలను, కొమర్రాజు లక్ష్మణరావు గారి అముద్రిత వ్యాసంలోనివి, రాళ్లపల్లి వారు 'వేమన'లో పేర్కొనగా వానిని ప్రత్యేకంగా ఉట్టంకించినారు ఆరుద్ర గారు ఈ పుస్తకంలో. తెలుగునాట జాతీయాలుగా, నానుడులుగా పరిణమించాయి వేమన పద్యాలు. ఆ పద్యాలకు రసార్ద్రతను చేకూర్చినాయి ఆరుద్రగారి వ్యాఖ్యానాలు.

కీ.శే. ఆరుద్రగారు ప్రసిద్ధ కవులు, పండితులు, పరిశోధకులు, సాహితీవిమర్శకులు, సామ్యవాద దృక్పథం గల ఆదర్శమూర్తి, తెలుగు సాహిత్య చరిత్రను పూర్తిగా అధ్యయనం చేసి ఒక్క చేతితో సమగ్ర ఆంధ్ర సాహిత్య చరిత్రను సంపుటాలుగా వెలయించిన ప్రతిభా సంపన్నులు. వారి కలం నుండి వెలువడిందే ఈ వేమన్నవేదం.

ఈ వేమన్నవేదం పుస్తకాన్ని తెలుగువారి ముందుకు నాలుగోసారి తెస్తున్నందుకు యువ భారతి ఆనందిస్తున్నది. ఈ పుస్తకం రావడానికి ఆర్థిక సహకారాన్నందించిన యువభారతి జీవిత సభ్యులు, సాహితీప్రియులు శ్రీ పత్రి అశ్వినీకుమార్‌ను అభినందిస్తున్నది. వీరు విద్యార్థి దశనుండి యువభారతి కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటున్నారు. యువభారతి 1972లో యువకులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన వీరి వ్యాసం, భారత స్వాతంత్ర్య రజతోత్సవ సమీక్షావ్యాస సంకలనం 'మహతి'లో చోటుచేసుకుంది. శ్రీ అశ్వినీకుమార్ గారికి శుభాకాంక్షలు, కృతజ్ఞతలు. యువభారతి చేస్తున్న కార్యక్రమాలకు సాహితీప్రియుల సహకారాన్ని అర్థిస్తూ....

మీ

**అనంతాచార్య**

హైదరాబాద్
1.9.2010

అధ్యక్షులు, యువభారతి
చరవాణి : 9290702328

# ప్రేరణ

సమాజంలో సామరస్యాన్ని పెంపొందించేందుకు సాహిత్యానికి మించిన సాత్విక సాధనం లేదనే విశ్వాసంతో తెలుగు భాష, సాహిత్యాల అభివృద్ధికై ఇతోధిక కార్యక్రమాలను రూపొందించి కృషి చేస్తున్న సంస్థ 'యువభారతి'. 1963 విజయదశమి శుభదినాన స్థాపించబడిన నాటినుండి "చుట్టూరా ఆవరించుకొని ఉన్న చీకటిని తిట్టుకుంటూ కూర్చోవడం కంటే ప్రయత్నించి ఎంత చిన్న దీపాన్నయినా వెలిగించడం మంచిది" అన్న భావనే ఊపిరిగా నిర్మాణాత్మక కార్యశీలాన్ని, మానవతా విలువలతో కూడిన సేవాభావాన్ని ఆచరించి చూపిస్తోంది యువభారతి.

తెలుగు సాహిత్యమనే పాలకడలిని చిలికి, కష్టనష్టాల హాలాహలాన్ని తాను మ్రింగి, సారస్వతామృతాన్ని తెలుగు సాహితీలోకానికి అందించే ప్రయత్నం చేస్తోంది యువభారతి. అనంతమయిన తెలుగు సాహిత్యంలోని ఆణిముత్యాలను ఏర్చి, కూర్చి, సామాన్యపాఠకులకర్థమయ్యే రీతిలో పండిత ప్రకాండులచేత వ్యాఖ్యానాలు వ్రాయించి వీలయినంత తక్కువ వెలకు పాఠక లోకానికందించే ప్రయత్నమే మా 'సాహితీ వాహిని' పరంపర. అందులో మొదటగా బమ్మెర పోతన భాగవతంలోని ఏర్చి కూర్చిన పద్యమందారాలకు డా॥ సి. నారాయణరెడ్డి గారి మకరంద వ్యాఖ్యానం 'మందార మకరందాలు". ఆ పరంపరలో వెలువడిన రెండో తరంగం రసార్ద్రమయిన ఆరుద్ర వ్యాఖ్యానంతో వెలువడిన "వేమన్నవేదం".

'వేమన' అనగానే మనకు గుర్తు వచ్చేవి ఆయన ఆటవెలదులు. లోకంలో వాడుకలో ఉన్న చిన్న చిన్న పదాలతో తాను అందించదలచుకున్న సందేశాన్ని నిర్మొగమాటంగా, నిర్భయంగా, నిజాయితీగా, నిరాడంబరంగా అందించిన ప్రజాకవి వేమన. రాజాస్థానాలకు, క్లిష్టమయిన సంస్కృత భూయిష్టమయిన భాషకు, మితిమీరిన శృంగార వర్ణనలకు, తనకు ఆశ్రయమిచ్చిన ప్రభువుల పొగడ్తలకు, పండిత సభలకు పరిమితమయిన కవిత్వాన్ని ప్రజోపయోగం కోసం, సామాజిక హితం కోసం, సంఘ సంస్కరణ కోసం ఆయుధంగా మలచుకొని, అచ్చమయిన ప్రజల భాషలో, వారి కర్థమయ్యేరీతిలో వివరించి సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో 'వేమన' కృతకృత్యుడయ్యాడనే చెప్పాలి. పాల్కురికి సోమనాథుని తరువాత, కవిత్వాన్ని సంఘ సంస్కరణకి, సామాజిక చైతన్యానికి బలమైన ఒక పనిముట్టుగా వాడుకున్న అచ్చమయిన దేశీయ కవి 'వేమన'.

ఈ శతాబ్దపు మొదటి అర్ధభాగంలో నోటికి కనీసం పదయినా వేమన పద్యాలు రాని తెలుగువాడు లేడంటే అతిశయోక్తి కాదు. 'వేమన పద్యం రాని వాడు గాడిద' అనే సామెత కూడా

జనబాహుళ్యంలో ప్రచారంలో ఉండేది. కాని ఈనాటి యువత ఇంగ్లీషు మోజులో పడి మమ్మీ, డాడీ సంస్కృతి నలవరచుకొని, మాతృభాషని, తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను పూర్తిగా మరిచి ప్రవర్తిస్తోంది. నేల విడిచి సాము చేస్తోంది. ఇటువంటి తరుణంలో తాను చెప్పవలసిన విషయాన్ని సూటిగా, ఘాటుగా పదిమందికీ అర్థమయ్యే భాషలో చక్కటి సూక్తుల నందించిన వేమన పద్యాలు కొన్నింటినైనా నేటి యువతరానికందించగలిగితే వారికి తెలుగు భాష పట్ల అభిమానం పెరగవచ్చునని మా నమ్మకం. అందుకని 1974వ సంవత్సరం (ఆనంద ఉగాదికి) 40 ఎంపిక చేసిన 'వేమన్న' పద్యాలకు రసార్ద్రమైన ఆరుద్ర గారి వ్యాఖ్యానంతో వెలువడిన 'వేమన్నవేదం' అనే చిన్న పుస్తకాన్ని పునర్ముద్రించి ఈనాటి యువతరానికి అందజేయాలని సంకల్పించాము. ఇప్పటికే మూడు ముద్రణలు పొంది, ప్రజాదరణ నంది దాదాపు 18, 000 ప్రతులు అమ్ముడుపోయిన ఈ పుస్తకం నాల్గవ ముద్రణకి నోచుకోవడం, అదీ ఆరుద్రగారి 85వ జన్మదిన సందర్భంగా అచ్చు వేయాలనుకోవడం, మా పూర్వాధ్యక్షులు కీ॥శే॥ డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి గారి జయంత్యుత్సవ సందర్భంగా శ్రీకృష్ణ జన్మాష్టమి నాడు ప్రముఖ కవి, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్ డా॥ సి. నారాయణరెడ్డి గారి కరకమలాలతో ఆవిష్కరించబడడం మా అదృష్టంగా భావిస్తున్నాము. వారికి మా మనఃపూర్వక ధన్యవాదములు.

ఈ పుస్తకానికి ముచ్చటయిన ముఖపత్రాన్ని అందించిన ప్రముఖ కవులు, కథకులు, చిత్రకారులు అన్నింటికీ మించి మా యువభారతి గౌరవసభ్యులు శ్రీ శీలావీర్రాజు గారికి 'యువభారతి' పక్షాన కృతజ్ఞతల నందజేస్తున్నాము. అతి తక్కువ కాలంలో ఈ పుస్తకానికి అక్షరాలంకరణ చేసి, అందంగా ముద్రించి, సకాలంలో అందజేసిన కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, విద్యానగర్ వారికి మా ధన్యవాదాలు.

ఇలా 'వేమన్నవేదం' పుస్తకాన్ని పునర్ముద్రిస్తున్నామని తెలియగానే సంతోషంతో ముందుకు వచ్చి ఈ పుస్తక ప్రచురణకు ఆర్థిక సహాయం అందజేసిన సహృదయులు, సాహితీబంధువులు మా యువభారతి జీవిత సభ్యులు శ్రీ పత్రి అశ్వినీకుమార్ గారు. వారికి యువభారతి పక్షాన హృదయ పూర్వక శుభాభినందనలను అందజేస్తున్నాము.

మా ప్రయత్నం చిన్నదే అయినా వేమన గారి మాటల్లో చెప్పాలంటే 'చిత్తశుద్ధి కలిగి చేసిన పుణ్యంబు, కొంచెమైన నదియు కొదువకాదు, విత్తనంబు మఱ్ఱి వృక్షంబునకు నెంత' అన్నట్లు చిత్తశుద్ధితో ఈ చిన్ని పుస్తకాన్ని తెలుగు పాఠకలోకానికి సవినయంగా సమర్పిస్తున్నాము. ఆదరించి, ఆస్వాదిస్తారని ఆశిస్తున్నాము.

అయలసోమయాజుల నాగేశ్వరరావు
కార్యదర్శి
**యువభారతి**
చరవాణి : 9247328440

01-09-2010
'శ్రీవికృతి' కృష్ణాష్టమి

# మా గురించి

**(ప్రథమ ముద్రణ నుండి)**

మనిషిలో అంతర్లీనంగా, నిక్షిప్తంగా ఉన్న ప్రతిభా పరిమళాలు పరివ్యాప్తం గల్గినప్పుడే అతని సృజనాత్మక శక్తికి సార్థక్యం చేకూరుతుంది. సమాజంలో సౌందర్యం, సౌజన్యం, పెంపొందడానికి అనువైన వాతావరణం ఏర్పడుతుంది. పరస్పరావగాహనం కలుగుతుంది. నిర్మాణాత్మక దృక్పథాలకు ప్రాచుర్యం లభిస్తుంది. సమైక్య భావాలు కుదురుకుంటాయి.

ఆలోచనా స్వేచ్ఛ జాతిప్రగతికి, దేశపురోగతికి దోహదం కలిగించే విధంగానూ, కళాసృష్టికి ప్రతిభా వ్యుత్పత్తులు ప్రాతిపదికలు కాగలిగే విధంగానూ, వ్యక్తిత్వ నిర్మాణం సాంఘికాభ్యుదయంతో పెనవేసుకొనిపోయే విధంగానూ, సాహిత్య సాంస్కృతిక కార్యకలాపా లను సజీవజాతి నిర్వహించుకుంటుంది. ప్రజాస్వామ్య వ్యవస్థకు నారుపోసేవి ప్రతిభా సౌమనస్యాలే.

యువభారతి కడచిన పదేళ్ళుగా సమాజంలో సామరస్యాన్ని పెంపొందించేందుకు సాహిత్యంకంటె ఇతరమైన సాత్విక సాధనం లేదనే విశ్వాసంతో ఇతోధిక కార్యక్రమాలను రూపొందించి కృషిచేస్తున్నది.

పక్షానికి ఒకమారు శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయంలో సాహిత్య సమావేశాలను ఏర్పరచి, యువభారతి తన సభ్యులకు సక్రమంగా ఆలోచించే పద్ధతిని, అందంగా శక్తివంతంగా, అర్థవంతంగా మాట్లాడగలిగే సామర్థ్యాన్నీ, నైపుణ్యాన్నీ ఎదుటివారి అభిప్రాయాలను సహనంతో వినే సహృదయాన్నీ, ఆలోచన రేకెత్తించి, వివేకాన్ని ఉద్దీపింప చేయగలిగే అధ్యయన శీలతనూ అలవరచేందుకు వివిధదృక్కోణాలతో రూపొందించిన కార్యక్రమాలను నిర్వహిస్తున్నది.

సాధ్యమైనంత తక్కువ వెలకు వీలైనంత ఎక్కువమందికి ఉత్తమ సాహిత్యాన్ని ప్రజానీకానికి అందిస్తే సాహిత్యంపట్ల అనురక్తి పెరుగుతుందనే నమ్మకంలో ప్రచురణ పూర్వవిరాళపద్ధతిని ప్రవేశపెట్టి సరస్వతీ సాక్షాత్కారం, జీవనగీత, కావ్యలహరి, చైతన్యలహరి, వికాసలహరి, వంటి సాహితీతపోమూర్తుల సందేశాలనందించే గ్రంథాలను వేన వేల సంఖ్యలో ప్రచురించి, ఉభయనగరాలలోని రసికులనేకాక యావద్భారత దేశంలోని సాహితీప్రియుల మన్ననలను పొందగలిగింది. 'మారుతున్న విలువలు – రచయితల బాధ్యతలు' అనే ఒక గోష్ఠిని నిర్వహించి, ఆ గోష్ఠి వ్యాసాలను 'రచన'గా ప్రచురించింది. భారత స్వాతంత్ర్య రజతోత్సవ సందర్భంగా కడచిన 25 ఏళ్ళలో తెలుగు దేశంలో సాంస్కృతిక సాహిత్య భాషా సంబంధమయిన తీరుతెన్ను లను వివరిస్తూ నూరుగురు ప్రముఖుల వ్యాసాల సంపుటిని 'మహతి'గా ప్రచురించింది.

భారతదేశంలో ఎక్కడున్నా సరే – యువభారతి నిర్వహిస్తున్న సాహిత్యోద్యమంలో పాలుపంచుకోగలిగేందుకు రసికులకు సాహితీమిత్ర పథకాన్ని రూపొందించింది. ఇప్పటికి దాదాపు

6వేలకు పైగా సహృదయులు సాహితీమిత్రులుగా చేరినారు. ఈ సాహితీమిత్రుల సాహితీ వికాసానికి తోడ్పడేందుకు ఒక కవితా సంకలనం 'ఉషస్సు'ను 'కథావాహిని' అనే రెండు కథాసంకలనాలను ప్రచురించింది. యువభారతి సభ్యుల కవితా, కథాసంకలనాలు 'వీచికలు – అక్షరాలు – స్వరాలు – ఉదయం' కూడా వెలువడినవి.

జంటగనగరాలలో వేనవేల సంఖ్యలో భాషాభిమానులను ఆకర్షించి, పెద్ద ఎత్తున సాహిత్య సభలను యువభారతి నిర్వహించగలిగింది. తెలుగు సాహిత్యం గురించి తెలుగువారికి తెలుపడమేకాదు, అన్యభాషీయులకు గూడా తెలుపబూనుకోవడంలో ఔచిత్యముందని అలాగే అన్యసాహిత్య సంస్కృతుల విశేషాలను తెలుగువారు తెలుసుకోవలసిన అవసరం ఎంతయినా ఉందని మా విశ్వాసం. దీనికి నాందిగా 34 ఇంగ్లీషు వ్యాసాల సంకలనం 'Free India Forges A head' ను వెలువరించింది.

బమ్మెరపోతన భాగవతంలోని యాభైరెండు పద్యాలను 'మందార మకరందాలు'గా మహాకవి డా॥సి. నారాయణరెడ్డిగారి కమనీయ వ్యాఖ్యతో ప్రచురించి, లక్షప్రతులు అందించాలనే సంకల్పంతో రెండు ముద్రణల్లో 35 వేలు ఒక రూపాయికే అందించి మూడవ ముద్రణకు పూనుకోబోతున్నాం. 'సాహితీవాహిని'లో రెండవ తరంగంగా 'వేమన్న వేదం' మూడవ తరంగంగా 'భోగినీలాస్యం' ఈ ఆనంద ఉగాదినాడు తెలుగు పఠితలకు అందజేస్తున్నాం.

మన తెలుగులోనే కాకుండా విశ్వసాహిత్యాన్ని తమ ప్రతిభాప్రభావాలతో సంపన్నం చేసిన మహనీయుల సందేశాలను కూడా సాహితీవాహిని పరంపరలో వెలువరించాలని, ద్వైమాస పత్రికగా ఈ 'సాహితీవాహిని'ని నిర్వహించి ఒక్కొక్క సంచికలో ఒక్కొక్క కవినో, సాహితీప్రక్రియనో, విజ్ఞాన విషయాన్నో తెలుగు పాఠకలోకానికి అందించాలని ప్రణాళిక రూపొందించినాము.

ఉడుతాభక్తితో మేము చేస్తున్న భాషాసేవకు అండదండలుగా నిలిచింది ప్రజలు, వారి సౌహార్దం, భాషాప్రియత్వం, ఇదే మా పెట్టుబడి. మా తపస్సు ఫలించి తెలుగుదేశంలో అధ్యయనశీలతా, సౌజన్యం, పెంపొందించాలని ఆకాంక్షిస్తున్నాం.

**ఇరివెంటి కృష్ణమూర్తి**
అధ్యక్షుడు
24-3-1974
**యువభారతి**

# ప్రేరణ

(ప్రథమ ముద్రణ నుండి)

"సొంతలాభం కొంతమానుకు
పొరుగు వాడికి తోడుపడవోయ్!"

మరీ నిస్వార్థంగా ఉండగలగడం సంభవమేనేమో, కానీ – అసలుకు ముప్పురాకుండా మనగల్గడం ఎంతైనా అవసరం. అందుకేనేమో సొంతలాభం కొంత మానుకొమ్మని సెలవిచ్చారు మహాకవి గురజాడ. యువభారతి నిర్వహిస్తున్న కార్యక్రమాలలో ఈ సొంతలాభం కొంతమానుకొని, సమాజపరమైన లాభానికై ప్రయత్నిస్తున్న విషయం సహృదయులకు విదితమే. "వట్టిమాటలు కట్టిపెట్టి గట్టిమేల్ తలపెట్టాలి" అనేభావం సూచించేధ్యేయం ప్రేరణగా యువభారతి నడుస్తోంది. సమాజంలో సామరస్యం పెంపొందాలనీ – సమగ్రమైన అవగాహన కలగాలనీ – సమ్యక్‌దృష్టి ఏర్పడాలనీ – కనీసవిలువలపై నమ్మిక, మానవతామర్యాదలపై విశ్వాసం పెరగాలనీ – ప్రజాస్వామ్యం విలువలు పదికాలాలపాటు పదిలంగా కాపాడబడాలనీ – అందుకని, అచ్చుపోసిన అక్షరాల ద్వారా ఆలోచనలను వెదజల్లవచ్చుననీ – ఉత్తమ సాహిత్యం చౌకగా అందించడం ఇందుకు అవసరమనీ – యువభారతి కృషిచేస్తున్నది.

పదాలను పొదుపుగా, నిజాన్ని నిర్మొహమాటంగా చెప్పిన ప్రజాకవి వేమన సూక్తులకు– రసార్ద్రమైన ఆరుద్ర వ్యాఖ్యతో – వేమన్నవేదం మీ ముందుంది. మాట తప్పకూడదన్న పట్టింపు కారణంగా, "వేమన్న వేదం"ను ఒక రూపాయికే అందిస్తున్నాం. ఈ సౌకర్యాన్ని యువభారతి సాహితీమిత్రులకు పరిమితం చేస్తున్నాం. నిజానికి – పెరిగిన ధరలు, పోటీపడి పెరిగిన ఇతర ముద్రణ ఖర్చులు – సొంతలాభం కొంత మానుకోవడం దేవుడెరుగు – నష్టం భరించాల్సి వస్తుందేమోనన్న భయాన్ని కలిగిస్తున్నాయ్. ఎందుకంటే – నిర్వహణ ఖర్చులు కలుపుకోకుండానే – అచ్చుఖర్చులే ప్రతికి రూపాయిని తాకుతున్నాయి కాబట్టి.

పుస్తకాలను ముద్రించడం కష్టం. అచ్చువేసినవాటిని అమ్ముకోవడం కష్టం. ఎంత ఆలస్యం! ఎంత కమీషన్ !! ఈ విషవలయంనుండి బయటపడాలంటే పుస్తకాలను కొని చదివేవారిసంఖ్య పెరగాలి. పుస్తకాలు అధికసంఖ్యలో అమ్ముడుపోవాలి. అదీ త్వరితంగా అమ్ముడుపోవాలి. అప్పుడే – తక్కువలాభంతో సర్దుబాటుచేసుకొని, ప్రచురణ కార్యక్రమాన్ని

కొనసాగించే అవకాశం ఉంటుంది. ఈ మేరకు సహృదయుల మనస్ఫూర్తి సహాయ సహకారాలను ఆర్థిస్తున్నాం.

'మీ ద్వారా మరొక్కరికి మరొక్క ప్రతి అందేలా చూడండి' అని అర్థిస్తున్నాము. ఈ మాత్రం సాయంచేయడం – మీకు పెద్దభారం కాదని ఆశిస్తున్నాం. ఈ వేమన్నవేదం మీకు నచ్చుతుందని భావిస్తున్నాం. ఇలాంటి ప్రయత్నాలు నిరవధికంగా కొనసాగాలనీ మీ అభిమతమైతే – మీరు మనస్ఫూర్తిగా సహకరించండని విన్నవిస్తున్నాం. ప్రత్యక్షంగా, ఆర్థికంగా సాయపడవచ్చు. అంతకన్న ముఖ్యం. మీ స్నేహితులకు యువభారతి ప్రచురణలను పరిచయం చేసి, వారిచేత కొనిపింపచేయడం; వారిని సాహితీమిత్రులుగా, భారతీమిత్రులుగా, భారతీ భూషణులుగా చేర్పించడం – ఇలా మీ సహాయ సహకారాలను అందించవచ్చు. వీలైనంత ఎక్కువమందికి వీలైనంత తక్కువధరకు ఉత్తమసాహిత్యాన్ని అందించబూనుకుంటున్నందు వలన – ప్రచారం అవసరమనీ, అధికసంఖ్యలో ఇలాంటి ప్రచుణలు త్వరత్వరగా రావాలంటే– సహృదయులందరూ, ఇది తమపనిగా పూనుకొని సహకరించాలనీ విన్నవిస్తున్నాం.

నిజానికి, వేమన్న వేదంతో – సాహితీవాహినిపేరిట ద్వైమాస పత్రిక ప్రచురణ ఆరంభించాలని సంకల్పించాం. కాని, పెరుగుతున్న ముద్రణఖర్చులు ఆ ఆలోచనను దూరంగా నెట్టివేస్తున్నాయి. ఈ వాహినిలో ప్రతి తరంగాన్నీ ఒక రూపాయికే అందించాలని ఆరంభించినా – రెండవతరంగంనాటికే ధరలు రెండురెట్లకుపైగా పెరిగినందువల్ల – అతి క్లిష్టపరిస్థితుల్లోనే సాధ్యమౌతోంది. రానున్న ప్రచురణలను, ఈ ధరకు అందించలేమేమోనన్న అనుమానం బలంగా వుంది. "లావొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యె". అయినా – వీలున్నంతవరకు ప్రయత్నించాలన్న దృఢసంకల్పంతోనే ఉన్నాం. మాకృషిని, ధ్యేయాలను అర్థంచేసుకోగలిగిన సహృదయులు తమ సహకారాన్ని మనస్ఫూర్తిగా అందిస్తే – ఈ క్లిష్టపరిస్థితుల్లో కూడా – కృషిని కొనసాగించడానికే ప్రయత్నిస్తామని విన్నవిస్తూ –

మీ సహకారం అందుతుందని విశ్వసిస్తూ –

**24–3–1974**
**ఆనంద ఉగాది**

**వంగపల్లి విశ్వనాథం**
సమావేశకర్త.

# ఆ ముఖం

(ప్రథమ ముద్రణ నుండి)

తెలుగు ప్రజానీకానికి వేమన్న ఒక మహాయోగి. మట్టిలో పుట్టి మహోన్నత శిఖరాల నందుకున్న మానవతామూర్తి ఆయన. మనుషుల మధ్య తిరుగుతూనే మానవజీవిత సత్యాసత్యాలను నిత్యాన్వేషణశీలంతో దర్శించి విమర్శించిన వివేకి ఆయన. ఆయన యోగమంతా అన్వేషణ. అన్వేషణలో అందివచ్చిన అనుభవాలను ఆటవెలదుల్లో అలవోకగా లోకాని కందించాడామహానుభావుడు. ఆయన సూక్తి ఆయన అంతర్వ్యక్తికి అద్దంపట్టిన అభివ్యక్తి. ఆయన అంతస్సాధన ఆయనకు ముక్తినిచ్చిందో లేదో కాని ఆయన సూక్తిలోని శక్తిమాత్రం జాతికొక నూత్నవ్యక్తిత్వాన్ని ప్రసాదించింది. ఆయన సాధకుడు, బోధకుడు. జీవితమహాసాగరాన్నిమథించి చేదును కుత్తుకలో, అమృతాన్ని అంతరంగంలో నిలుపుకొన్న విధం ఆయనసాధనం. అమృతమయమైన సత్యాన్ని చేదు నిజాలతో నిరూపించి చిత్తాలకు హత్తేటట్లు చెప్పటం ఆయన బోధనం. ఆయన బోధనసాధనం సరళమైన దేశీయచ్ఛందం. ఆయన దర్శించిన అపూర్వసత్యాలు ఆయన్ని ద్రష్టను చేశాయి. ఆయన చెప్పిన సూక్తిమౌక్తికాలు ఆయన్ను స్రష్టను చేశాయి. ప్రజలకు కావలసింది ఆయన దర్శనం; అందువల్లనే ఆయన వారికి యోగిలా సాక్షాత్కరిస్తాడు. సాహితీరసికులకు కావలసింది ఆయన సృజన వ్యాపారం. వారికాయన మహాకవిలా ప్రత్యక్షమౌతాడు.

వేమన్న వ్యక్తిత్వం విచిత్రమైనది. ఆయనకు పాండిత్యంకంటె పరమార్థం గొప్ప. అందువల్లనే పాండిత్యంకోసం పండితుల పాదాలనంటలేదు. పరమార్థం కోసం జీవితాన్ని గురువుగా ఎంచుకున్నాడు. జీవితం సత్యానికి మౌనవ్యాఖ్యానం చేస్తుందిగాని పాఠప్రవచనాలను తర్కవ్యాఖ్యానాలతో వితర్కంచేయదు. జీవితానికి మొగమోటాలు లేవు; మెరమెచ్చులు లేవు. అది వరాన్ని ఎంత ఔదార్యంతో ఇస్తుందో శాపాన్నీ అంత నిర్దాక్షిణ్యంగా ఇస్తుంది. ఆటు పోటులతో కూడుకొన్న జీవితాన్ని ఆశ్రయించిన సాధకుడికి అటు రక్తికీ ఇటు విరక్తికీ అవకాశముంది. రక్తిలోపడి సాధకుడు పరమార్థాన్ని మర్చిపోతే జీవితం శపిస్తుంది. శాపగ్రస్తుడైన జీవి విరక్తిమార్గం పడతాడు. పరమార్థాన్ని అన్వేషిస్తాడు. వేమన జీవితం ఇదే మార్గం పట్టింది. యౌవనంలో అందిన ఐహికభోగాలను అనుభవిస్తూ పోయాడు. అందులో ఆయనకు

అర్థార్థిసంబంధం తప్ప పరార్థంతో కూడిన పరమార్థం కనపడలేదు. కాంచనం, వంచనం రక్తిమార్గంలో ముళ్ళపొదల్లా కనిపించాయి. ఆ మార్గం వదలిపెట్టాడు వేమన. రక్తిని వీడినప్పుడు భక్తిని పట్టే అవకాశం ఉంటుంది సాధకుని జీవితంలో. భక్తికి విశ్వాసం బలం. వేమన్న వివేకాన్ని నమ్మినంతగా విశ్వాసాన్ని నమ్మినవాడు కాడు. అందువల్ల భక్తుడు కాలేకపోయాడు. కానీ, భగవంతుని చేర్చే మార్గాలనన్నిటినీ పరామర్శించాడు. భగవంతుడికీ మనిషికీ మధ్య మతంపేరిట మనిషే కల్పించిన ప్రతిబంధకాలు ఆయన మనస్సును గాయం చేశాయి. బహిర్ముఖమైన జీవితంమీద ఆయనకు కోపం వచ్చింది. అంతర్ముఖుడై ఆయనలోనే భగవంతుణ్ణి చూచుకున్నాడు. జీవితం నేర్పిన గొప్ప గుణపాఠం అది.

వేమన్న జీవితం వెంట తిరిగినప్పుడల్లా జీవితం లోకంలోని తప్పులనే ఎత్తి చూపించింది. చివరకు నీలోనే నిజం ఉంది తెలుసుకో మని చెప్పి దూరమైంది. వేమన్న తనకు తాను గురువైనాడు. తనకు తాను శిష్యుడైనాడు. శిష్యుడుగా తాను లోకవర్తనంలో ఉన్న గురువైనాడు. తనకు తాను శిష్యుడైనాడు. శిష్యుడుగా తాను లోకవర్తనంలో ఉన్న వుచ్చకాయితనాన్ని ప్రశ్నించుకుంటాడు. గురువుగా తానే సత్యాన్ని నిరూపించుకొంటాడు. ఆయన అంతర్వ్యక్తిలో జరిగే ఈ సంవాదసారమే ఛందోరూపం తాల్చి బయటపడుతుంది. ఆయన కవిత అందుకే ఆత్మాశ్రయమైంది. అదే దాని అంతర్లీనమైన శక్తి.

వేమన స్వయంకృషితో సత్యాన్ని స్వాయత్తం చేసుకొన్న సాధకుడు. అందువల్ల ఆయన ప్రవృత్తిలో స్వాతంత్ర్యం సానలుదీరి రాణిస్తుంది. అది భావంలోనూ భాషలోనూ ప్రతిఫలించింది. ఆయన తిట్టినట్లు చెప్పినా, కొట్టినట్లు చెప్పినా, వినేవాడికి ఆయన స్వాతంత్ర్యం మీద సానుభూతి కలిగింపచేస్తుంది. ఉన్నది ఉన్నట్లు చెప్పి విన్నవాడికి ఉడుకెక్కించినా, కన్నది కన్నట్లు చెప్పిన నిజాయితీ అతనిమాటకు తలలూపింపచేస్తుంది. బింకానికి పోని ఆయనభాష బిగువుతో కూడిన సూటిదనాన్ని ప్రదర్శిస్తుంది. బూతులు పలికినా, నీతులు చెప్పినా నిర్లిప్తతతో నిండిన ఆయన నిర్మొగమాటం మాటకొక నిండుతనాన్ని సంతరిస్తుంది. అగ్రహంతో చెప్పినా, నిగ్రహంతో చెప్పినా ఆయనమాటల్లో అంతర్వాహికంగా సాగివచ్చే హాస్యధోరణి నొచ్చుకొన్న వాణ్ణికూడా నవ్వింపచేస్తుంది. కవ్విస్తూ నవ్వించే శక్తి వేమన్న కవితకే దక్కింది.

వేమన్న దృష్టిలో మనిషే దేవుడు. ఆయన తత్త్వం మానవతావాదం. మనిషి తనకు తాను ద్రోహం చేసుకొన్నా, మరోమనిషికి ద్రోహంచేసినా, ఆత్మవంచన, దైవవంచన అంటాడు వేమన. మనుషులమధ్య తాత్త్వికంగా తరతమభేదం లేదంటాడు. కులవర్గభేదాలు మానవ

కల్పితాలంటాడు. మనిషిలో మానవత్వాన్ని చంపే మతాన్ని గర్హిస్తాడు. ఉన్నత మానవతా గుణాలను ప్రబోధిస్తాడు. వేమన్న దృష్టిలో ప్రబోధమెంత ప్రధానమో సంస్కరణమంత అవసరం. మూఢవిశ్వాసాలనూ, అర్థరహితమైన ఆచారాలనూ, స్వార్థపోషకాలైన వర్గభేదాలనూ సంస్కరణ దృష్టితో ఆయన అవహేళనం చేస్తాడు. ఆయన ఆత్మోద్ధరణతోపాటు సమాజసముద్ధరణాన్ని కాంక్షించిన కర్మయోగి; మానవుడే మాధవుడని చెప్పిన జ్ఞానయోగి. అందుకే నేటికీ మనకు వేమన్న వాక్కు వేదంలా వినిపిస్తుంది. ఏనాటికైనా అది నిలుస్తుంది.

'విశ్వదాభిరామ వినుర వేమ' అన్నమకుటంతో ఉన్న ఆయన పద్యం కనీస మొకటైనా రాని తెలుగువాడుండడు. భక్తి మాధుర్యానికి పోతన్నవాక్కు, సూక్తి సారళ్యానికి వేమన్న వాక్కు తెలుగువారి ముఖమందిరాల్లో గౌరవప్రతిపత్తులను సంపాదించుకున్నాయి. సమాజంలో సాహిత్యచైతన్యాన్ని కల్గించాలన్న ధ్యేయంతో కృషిచేస్తున్న యువభారతి పోతన్న భాగవతంలో నుండి ఎన్నిక చేసిన పద్యాలతో 'మందారమకరందాలను' ప్రచురించిన తరువాత ప్రజాకవి వేమన పద్యాలతో వేమన్న వేదాన్ని ప్రచురించటం హర్షింపదగిన విషయం.

ఆధునిక సాహిత్యంలో నేడున్నంత సామాజికస్పృహ పూర్వయుగాలలో కనపడదు. వేమన్న పద్యాలలో కూడా సామాజికస్పృహ కొట్టవచ్చినట్లుగా కనపడుతుంది. సమాజంలోని కుళ్లను తీవ్రంగా నిరసిస్తూ సామ్యవాద రచయితలు వచనకవితాప్రక్రియను సాగిస్తున్న ఈ అభ్యుదయకవితా యుగంలో వేమన కవిత అభ్యుదయభావ ప్రచారానికి అభినవసాధనంగా సమాదరింపబడుతున్నది. తీవ్రవాదుల తీండ్రింపును సమర్థించని మానవతావాదుల సౌమ్య వాదానికికూడా వేమనసూక్తులు సామ్యవేదంలా సాక్షాత్కరిస్తున్నవి. సమకాలీన సాంఘిక స్పృహతో వివిధ ప్రక్రియల్లో కవితను రచిస్తున్న రచయితలకు వేమనవాక్యం విశ్వజనీనమైన వేదంలా వినిపిస్తున్నది. వేమన పద్యాలకు నేటి వ్యాఖ్యానం – కాలదోషంపట్టని కవి వాక్కులను సమకాలీన సమాజానికి సమన్వయంచేసి చెప్పటం.

ప్రసిద్ధాధునికాంధ్రకవులు, సమగ్రాంధ్రసాహిత్య చరిత్రకర్తలు అయిన శ్రీ ఆరుద్ర వేమనపద్యాలకు వ్యాఖ్యానం వ్రాయటంలో ఔచిత్యం ఉంది. ఆయన ఆంధ్రసాహిత్యసారాన్ని అపోశనపట్టిన అపరఅగస్త్యులు. సామాజిక వ్యవస్థను సామ్యవాద దృక్పథంతో సమీక్షించినా సౌమ్యశీలంతో సత్యాన్ని విశ్వజనీనంగా ప్రతిపాదింపగలిగిన ప్రతిభావంతులు. కవితా ప్రక్రియల్లోని కళారహస్యాలతోపాటు, కవిహృదయాన్ని ఆవిష్కరించే రసవత్తరమైన రచనా రహస్యాలను తెలిసిన రసికులు వారు. కవిత వ్రాసినా, చరిత్ర చెప్పినా, విమర్శ వెలయించినా


పతితమనసుకు సూటిగా హత్తుకొనే వాక్పాకం వారి కలానికి వెన్నతోనచ్చినవిద్య, వెలలేని వేమన్న సూక్తులకు తులలేని వ్యాఖ్యానం ఆరుద్రగారి ఈ వచనం.

వేమన్న సూక్తులు వేనకువేలున్నాయి. అందులోనుండి 40 సూక్తాలను ఎన్నుకున్నారు ఆరుద్రగారు. వాటిని ఒక సమన్వయ సూత్రాన్ని అనుసరించి అనుసంధించి చెప్పారు. వేమన్న సాధనలు, వేమన్న వాక్యాలలో వినిపించే సమసమాజ నిర్మాణప్రబోధాలు, ప్రబోధాల్లో ప్రతిబింబించవలసిన చిత్తశుద్ధీ, ఆచరణలో అలవడవలసిన వివేకసిద్ధీ, గార్హస్థ్య జీవితంలో కనవచ్చే అనురాగ లబ్ధీ, మనిషిలో నిలచి ఉన్న దేవుడూ, మనసులో నిండియున్న మమత, అనర్హులైన అధికారుల పాలనంలో ప్రజలు పడే పాట్లూ, వేమన బోధించిన మతం, తత్త్వం – ఇలా ఎన్నో అంశాలను అందంగా అతికినట్లు వరుసగా వివరించారు వ్యాఖ్యానంలో. ఎన్నుకున్నవి 40 సూక్తాలైనా వ్యాఖ్యానంలో సమన్వయంకోసం ఎన్నో సూక్తాలను అరుద్రగారు ఉదాహరించారు. వేమన చాటుపద్యాలనన్నీ సమీక్షించి, విషయవివేచన దృష్టితో వర్గీకరించి, ప్రధానంగా 40 అంశాలను ప్రతిపాదించే పద్యాలను ఎన్నుకొని సజాతీయభావాలు కలిగిన చాటువులను ఆయా పద్యాల వ్యాఖ్యానాల్లో ఉటంకిస్తూ సాగిన ఆరుద్రగారి వ్యాఖ్యానం – వేమన తత్త్వానికి పట్టిన వాఙ్మయ దర్పణం.

రసార్ద్రమైన అరుద్రవ్యాఖ్యతో వేమన్నవేదాన్ని ప్రచురించగలిగిన యువభారతిని అభినందిస్తున్నాను.

**24-3-1974**
**ఆనంద ఉగాది**

**డా॥ జి.వి. సుబ్రహ్మణ్యం**
ప్రధాన సంపాదకులు
యువభారతి ప్రచురణలు



# వేమన్న వేదం

## 40 సూక్తములు : ఒక మండలం

వ్యాఖ్యాత : **ఆరుద్ర**

**1. అనగననగ రాగ మతిరమ్యమై యుండు**
**తినతినగ వేము తియ్యనగును**
**సాధనమున పనులు సమకూరు ధరలోన**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

సిద్ధార్థునిలాగే వేమన్నగారు కూడా మొదట సర్వసంగ పరిత్యాగం చేసి వెళ్ళిపోయారు. బోధిసత్త్వుని లాగే వేమన్నగారు సైతం, జ్ఞానోదయ మయ్యాక, తాము తెలుసుకొన్నది లోకానికి చెప్పాలని జనంమధ్యకు వచ్చారు – వారు చెప్పవలసినవి ఎన్నో ఉన్నాయి. చెయ్యవలసినవి ఎన్నో ఉన్నాయి. తాను చేయదలచుకొన్న సంస్కారం ఏటికి ఎదురీత. అది సాధ్యమేనా అన్న సందేహం వారికి కలిగింది. ఆ సందేశానికి నివృత్తికూడా కలిగింది.

"విశ్వాన్ని ఇచ్చే వానికి ఇంపైనవాడా! ఓ వేమా! ఆలకించరా!"

అని తమకు తాము చెప్పుకొన్నట్టు లోకానికి చెప్పసాగారు. పాడగా పాడగా పాట రక్తికడుతుంది. తినగా తినగా వేము తియ్యనవుతుంది. (ఆ వేములాగే ఈ వేముని ఉపదేశము కూడా). చెయ్యగా చెయ్యగా చేపట్టిన కార్యాలు ఈ లోకం లోనే సిద్ధిస్తాయి. 'ప్రయత్నించు!' అని ఆ కార్యాచరణకు పూనుకొన్నారు.

**2. ఉర్వివారి కెల్ల నొక్క కంచము బెట్టి**
**పొత్తు గుడిపి కులము పొలయ జేసి**
**తలను చెయ్యిబెట్టి తగ నమ్మ జెప్పరా,**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

సమాజంలో ఉన్న బాధలకు, దుఃఖాలకు, దురహంకారానికి, దౌర్జన్యానికి, గర్వానికి హైన్యానికి మూలకారణం వర్ణవ్యవస్థ, వర్గవిభజన అన్న సత్యాన్ని వేమన్నగారు తెలుసుకొన్నారు. మానవులలో ఎక్కువ తక్కువలు ఉన్నంతకాలం చిక్కులు తప్పవు.

"బాప డనగ నేమి ? భక్తుడనగ నేమి?
జోగి యనగ నేమి? సొంపు లేక
ఎన్ని పేరులైన ఇనజుడు పనితీర్చు"

అని గుర్తించారు. (ఇనజుడు అంటే యముడు) తమకులాలకు ఎన్నిపేర్లు పెట్టు కొన్నా కట్టకడపట యముడు అందరిపనీ పడతాడు. చావడంలో అందరూ సమానులైతే బ్రతకడంలో ఎందుకు సరిసమానులు కాకూడదు?

లోకమంతా ఒకటే కుటుంబం, లోకులంతా ఒక కుటుంబంలోని వ్యక్తులు. ఎవ్వరూ పంక్తి బాహ్యులు కారు. అందరూ ఒక్క కంచాన తింటే అన్ని బాధలకూ హేతువైన కులభేదం రూపు మాసిపోతుంది; సఖ్యత ఉంటుంది. ఈ సత్యాన్ని లోకులు విశ్వసించేటట్టు తలమీద చేయివేసి ప్రమాణపూర్తిగా చెప్పరా! అని ఆదేశం.

నూతన మతాన్ని ప్రబోధించే వాళ్ళెవరైనా మొట్టమొదట చేపట్టే సంస్కారం ఈ ఏక పంక్తిభోజనమే. బసవేశ్వరుని వీరశైవంలో కులవిభేదాలు లేవు. బ్రహ్మనాయుడు అందరికీ ఒక్క బంతిలో 'చాపకూడు' పెట్టించాడు. గురునానక్ తన శిష్యులు ఒక్క 'లంగర్' లో వండినదే భుజించాలని నిర్దేశించాడు. (ఇటీవలి కాలంలో సామ్యవాద సాధకులైన వామపక్షాలవారు కూడా తమ పార్టీసభ్యులు ఒకే 'కమ్యూన్'లో ఆరగించాలన్న నియమం పెట్టుకొన్నారు).

సంఘ సంస్కారంలో ఈ సహపంక్తి భోజనాన్నే ప్రవక్తలు ప్రముఖమని భావించారు.

"జాతి నీతి లేక, జన్మమ్ము లొక్కటి
అరయ తిళ్ళు వేరె ఆకలొకటి"

అని వేమన్నగారు తెలుసుకొన్నారు. ఆకలి ఒకటే అయినప్పుడు తిండికూడా ఒకటే కావాలి. అప్పుడే సమానత్వం సాధ్యమవుతుంది.

కొన్ని కొన్ని మతాల వారు కొన్ని మాంసాలను, కొన్ని వర్గాలవారు కొన్ని కొన్ని శాకపాకాలను నిషేధించారు. తమకు నిషిద్ధమైన వాటిని భక్షించే జాతులను హీనంగా చూసేవారు. మాలమాదిగలు గొడ్డుమాంసం తింటారు కనక వాళ్ళు అధములనే అగ్రవర్ణ మాంసభుక్కులను ఇలా ప్రశ్నించారు.

"కసవు నేరి తినెడు పసరము తినువాని
మాల యండ్రు గాని మహిని జనులు
పంది కోడి దిన్న ప్రాజ్ఞులటందురా"

మాలలు తినే పసరం కనీసం గడ్డి తింటుంది. ప్రాజ్ఞులు తినే పందులు, కోళ్ళూ అశుద్ధాన్ని మేస్తాయి. ఎవరు పవిత్రులు? కడుపు నిండడం ముఖ్యం.

"కడుపు కేల నరులు కళవళ పడెదరు?
కడుపు చల్లపడగ గలదు భుక్తి
కడకు రాతిలోని కప్పకు లేదొకో!"

అని వేమన్నగారికి తెలుసు. ముందు భుక్తి! తరువాత ముక్తి.

"అందరికీ ఒక్క కంచంలోనే కూడు" అనే సంస్కారం ఎంతవరకు ఫలిస్తుంది?

**3. చిత్తశుద్ధి కలిగి చేసిన పుణ్యంబు**
**కొంచెమైన నదియు కొదవ కాదు**
**విత్తనంబు మర్రివృక్షంబునకు నెంత**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

తాము ప్రబోధించే సంస్కారం చాలా పుణ్యమైనది. దీనిని చిత్తశుద్ధితో చేస్తే, సిద్ధించే ఫలితం ఎంతచిన్నదైనా అదేం తక్కువ పని కాదు. చూడ్డానికి మర్రి విత్తనం ఎంత చిన్నది. సారవంతమైనభూమిలో దానిని నాటితే, అది మొలకెత్తితే ఎంతటి మహావృక్షం గానో రూపొందుతుంది. ఊడలు దింపి ఎన్నివందల సంవత్సరాలో నీడనిస్తుంది. కనుక చిత్తశుద్ధితోనే ఏపనైనా చేయాలి.

సమాజశ్రేయస్సుకోసమే సంస్కారాలు ప్రారంభమవుతాయి. వాటికి అలవాటు పడ్డాక అవి ఆచారాలవుతాయి. అప్పుడు సైతం వాటిని చిత్తశుద్ధితోనే పాటించాలి.

"ఆత్మశుద్ధి లేని ఆచార మది యేల
భాండశుద్ధి లేని పాక మేల?
చిత్తశుద్ధిలేని శివపూజ యేలరా?

అని వేమన్నగారు ప్రశ్నిస్తున్నారు. చిలుంపాత్రలో వండినవంట విషప్రాయం. ఆత్మశుద్ధి లేని ఆచారం అనర్థదాయం.

తాము తలపెట్టిన సంస్కారాన్ని అగ్రవర్ణాలవారు వేదవిరుద్ధమని, ఆనాచారమని నిందిస్తారని వేమన్నగారికి తెలుసు.

"తప్పు లెన్నువారు తండోపతండమ్ము
లుర్విజనులకెల్ల నుండు తప్పు
తప్పు లెన్నువారు తమతప్పు లెరుగరు"

అని నొక్కిచెప్పారు. వాళ్ళ తప్పులను ఎత్తి చూపించారు.

"వె[్రికుక్కలవలె వేదాలు చదివేరు
ఆశయంబు లెరుగ రయ్యవాళ్ళు
వేదసార మెల్ల వేమన యెరుగును"

అని చాటిచెప్పారు. అయ్యవార్ల వేదపఠనం కడుపుకూటికే. అసలు వేదమంటే ఏమిటి? 'వేదయతీతి వేదః' తెలియజేసేదానిని వేదమంటారు. బ్రహ్మవిదుల విద్యలు సత్యాన్ని మరుగుపరుస్తాయేగాని వెల్లడిచేయవు అందుకే –

"వేదవిద్యలెల్ల వేశ్యలవంటివి
భ్రమలపెట్టి తేటపడగనీవు
గుప్తవిద్య యొకటె కులకాంత వంటిది"

అని వేమన్నగారు గట్టిగా చెప్పారు. వేదసారమైన ఆ గుప్తవిద్యను విశదం చేయ సాగారు. వేదవిద్యలు వేశ్యల వంటివైతే – వాటిని గట్టిగా గుడ్డిగా నమ్మమనేవాళ్ళు ఎటువంటివారు?

**4. కులము గలుగువారు గోత్రము కలవారు**
**విద్యచేత విఱ్ఱవీగువారు**
**పసిడి గల్గువాని బానిసకొడుకులు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కులీనులు, ఉన్నతగోత్రీకులు, విద్యావంతులు, మేధావులు అందరూ ధనిక వర్గాల దాసులే. శ్రీమంతుల ఐశ్వర్యాన్నీ అధికారాన్నీ సంరక్షించే శాస్త్రాలు, పురాణాలు, విశ్వాసాలు నిర్మించడం, ప్రచారంవేయడం వీళ్ళవృత్తి. తక్కువ కులంవాళ్ళకు అధికారం రాగానే వాళ్ళను చంద్రవంశానికో, సూర్యవంశానికో వారసులను చేసేస్తారు.

"కులములేనివాడు కలిమిచే వెలయును
కలిమిలేనివాడు కులము దిగును
కులముకన్న భువిని గలిమి యెక్కువ సుమీ!"

అని వేమన్నగారు రహస్యం చెప్పారు. సర్వగుణాలు కాంచనాన్ని ఆశ్రయించు కుంటాయి. సవర్ణులంతా స్వర్ణానికి సాష్టాంగదండప్రమాణాలు ఆచరిస్తారు. ఇందులో స్వప్రయోజనంకూడా ఉంది. స్వార్థపరులు తమ ఉదరపోషణార్థం ధనస్వాముల అండజేరి వారి అడుగులకు

మడుగులొత్తుతూ బతుకులు వెళ్ళబుచ్చుకొంటారు.

"గ్రాస మింత లేక కడు గష్టపడుచున్న
విద్య యేల నిలుచు వెడలుగాక
పచ్చికుండ నీళ్ళు పట్టిన నిలుచునా!"

అని వేమన్నగారు గుర్తించారు. విద్యావంతులందరూ గ్రాసంకోసం కలవారికి బానిసలై ప్రజలను మభ్యపెడుతున్నారు.

"పుత్తడిగలవాని పుండుబాధైనను
వసుధలోన చాల వార్త కెక్కు
పేదవానియింటి పెండ్లైన యెరుగరు"

ఇది ధనస్వామ్యవ్యవస్థలోని స్థితి. పేదలను అజ్ఞానంలో ముంచి పురోహితులు, పీఠాధిపతులు, స్వాములవార్లు లాభం చేసుకుంటున్నారు.

"బ్రతుకుతెరువులేని బడుగులందరు పెద్ద
యోగివరుల మంచు సాగిరాగ
బండవాండ్రు ముందు దండంబు లిడుదురు"

అని వేమన్నగారు గుర్తించారు. అయితే ఇంతస్వార్థం పేరుకొన్న సమాజంలో సజ్జనులు లేకపోలేదు.

**5. ఉప్పు కప్పురంబు నొక్కపోలిక నుండు**
**చూడ జూడ రుచుల జాడ వేరు**
**పురుషులందు పుణ్యపురుషులు వేరయా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

చూడ్డానికి ఉప్పూ కర్పూరం ఒక్కలాగే ఉంటాయి. నోట పెట్టినప్పుడే తేడా తెలుస్తుంది. అలాగే మానవులంతా ఒక్కలాగే కనబడ్డా, నోరు తెరిచినప్పుడు వాళ్ళ స్వభావాలు తెలుస్తాయి. సమాజంలోని సజ్జనులప్పుడే బయటపడతారు. ఉన్నత సంస్కార మున్న వీళ్లెప్పుడూ సౌమ్యంగానే మాట్లాడుతారు. విద్యలేనివాళ్ళే విర్రవీగుతారు.

"అల్పుడెపుడు పల్కు నాడంబరముగాను
సజ్జనుండు పల్కు చల్లగాను
కంచు మోగునట్లు కనకంబు మ్రోగునా?"

అని వేమన్నగారు ప్రశ్నిస్తున్నారు. అయితే ఆడంబరాలకే చెలామణి. వాక్శూరులదే మెజారిటీ. విస్సన్నలు చెప్పిందే వేదం.

"పదుగు రాడుమాట పాటియై ధర జెల్లు
నొక్క డాడుమాట యొక్క దెందు
ఊరకుండువాని నూరెల్ల నోపదు"

అని వేమన్నగారికి తెలుసు. అందుకే నోరుమూసుకొని ఊరుకోకూడదు. పది మందిని కూడకట్టుకోవాలి. అందుకని పట్టుపట్టారు.

"పట్టుపట్టరాదు, పట్టి విడువరాదు
పట్టెనేని బిగియపట్టవలయు
పట్టి విడుటకన్న పడి చచ్చుటే మేలు"

అన్నది వారి దీక్ష! పట్టుదలతో మానవులలోని మాలిన్యాన్ని విశుభ్రం చేయదలిచారు.

**6. చాకి కోకలుదికి చీకాకు పడజేసి**
**మైల దీసి లెస్స మడిచినట్లు**
**బుద్ధిచెప్పువాడు గ్రుద్దితే మేలయా**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

సమాజంలో ఉన్న దురాచారాన్ని దురాహంకారాన్ని దుర్మార్గాన్నీ రేవు పెట్టదలచు కొన్నారు. అంధవిశ్వాసాల మురికిని పోగొట్టాలంటే సంఘంలో చెలామణి అవుతున్న మలిన సిద్ధాంతాలను చీకాకు పరుస్తూ ఉతకక తప్పదు. మైలతీయడానికి మడివాలు బట్టలు బండలమీద బాదినట్లు అపనమ్మకాలను బాదక తప్పదు. ఇది గుండెలమీద గుద్దినట్టే అవుతుంది. న్యాయం, ధర్మం, సదాచారం అనుకొన్న వాటిని అవహేళన చేయక తప్పదు.

"న్యాయశాస్త్ర మరయ నన్యాయమున దించు
ధర్మశాస్త్ర మొసగు రుగ్మతంబు
జ్యోతిషమ్ము జనుల నీతుల దప్పించు"

అని వేమన్నగారు గుర్తించారు. జాతకాలు ముహూర్తాలు, శుభలగ్నాలు మొదలైనవి వేలంవెర్రిగా పరిణమించాయి. శాస్త్రోక్తమైన శుభలగ్నాలు పెట్టిన అశుభాలు అప్పు దప్పుడు తప్పవు.

"విప్రులెల్ల జేరి వెర్రికూతలు కూసి
సతిపతులను గూర్చి సమ్మతమున
మును ముహూర్తముంచ ముండెట్లు మోసెరా?"

అని వేమన్నగారు కుటిల జ్యోతిష్యాన్ని తూర్పార పట్టారు. ధర్మశాస్త్రాలు, గుహ్య సూత్రాలు, కర్మకాండలు క్రతువులూ అన్నీ అగ్రవర్ణాల కల్పితాలే! అనాదర్శవంతాలే! అందుకే తద్దినాలపై ధ్వజమెత్తారు.

"పిండములను జేసి పితరుల దలపోసి
కాకులకును పెట్టు గాడ్దెలార
పియ్యితినెడికాకి పితరు డెట్లాయెనో?"

అని నిలబెట్టి ప్రశ్నిస్తున్నారు. కర్మకాండలన్నీ పురోహితుల భుక్తికోసమే. 'బ్రాహ్మణులకు బెట్ట ఫలము కద్దందురు; కుక్కలకు బెట్ట కొదవయేమి? ఇందునందు జీవుడొక్కడే యుండును' అని బ్రాహ్మణులకన్ను వాళ్ళ బ్రహ్మజ్ఞానపు వేలితోనే పొడిచారు.

"ఆలిరంకు తెలుప నఖిలయజ్ఞంబులు
తల్లి రంకు తెలుప తద్దినాలు
కాని తెరువు కర్మకాండ కల్పితమాయె"

అని విడమర్చారు. యజ్ఞయాగాదులు చేసేటప్పుడు యజమాని భార్య, తాను వ్యభిచరిస్తే ఎన్నిసార్లు ఎవరితో పోయినదీ సూచించడానికి అన్ని గడ్డిపోచలను పెట్టాలి; తద్దినాలలో పేరుకు తండ్రి ఎవడైనా జన్మ యిచ్చిన వాడెవడో వాడికే పిండం చెందుతుంది. కట్టుకున్న భార్య రంకూ, కన్నతల్లి రంకూ బయట పెట్టించే కర్మకాండ దుర్మార్గమే. ఇలాంటి ఎత్తి పొడువులు పొడవకపోతే జ్ఞానోదయం కాదు. ఇలా గుద్ది చెప్పకపోతే ఫలంలేదు. 'బుద్ధి చెప్పువాడు గ్రుద్దితే నేమయా!' అని అందుకే వేమన్నగారు కచ్చితంగా చాటుతున్నారు. బుద్ధికలిగినప్పుడే తత్త్వం తెలుస్తుంది. తత్త్వమంటే ఏమిటి?

**7. తానె తత్త్వమనుచు తన్నెరుంగగలేక**
**మాయతత్త్వమనుచు మరుగుచుండు**
**ధర్మ కర్మములను దగ రోయ తత్త్వ మౌ**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

హైందవ దర్శనాలలో మాయకు, మాయాశక్తికి చాలా ప్రాముఖ్యం ఇచ్చారు. కాశ్మీర శైవం మాయే తత్త్వాలన్నింటికి కారణమంటుంది. అద్వైతం 'ఈ దృశ్య ప్రపంచమంతా అనృతం, మిథ్యాసదృశం' అంటుంది. ఈ జగత్తు రజ్జుసర్పభ్రాంతి వంటిదని చెప్తుంది. మన వేదాంతులు ఒకపక్క మాయావాదాన్ని ప్రబోధిస్తూనే ధర్మకర్మాలను ఆచరించమంటారు. వర్ణవ్యవస్థలో ఆదర్శాలను సుస్థిరం చేసే ధర్మాలను అవినీతికి దారితీసే కర్మలను తగిన విధంగా ఏవగించు కొనడమే నిందించడమే తత్త్వం అని వేమన్నగారి సిద్ధాంతం. 'రోయు' అనే క్రియాపదానికి 'వెదుకు' అనే అర్థం కూడా ఉంది. వేమన్నగారి కాలంలో ఈ అర్థం అంతవాడుకలో లేదనుకోవచ్చు. అయినా 'అన్వేషించు' అనే అర్థంలోనే ఈ మాటను వారు ఉపయోగిస్తే, సమధర్మాన్నీ సత్కర్మనీ అన్వేషించడమే తత్త్వమని ఆయన చెప్పారనుకోవాలి. ఈతత్త్వాన్ని కాక మాయను తత్త్వమనుకొంటే జ్ఞానానికి చాటు అవుతాడు. గుప్తవిద్యను వెల్లడి చేస్తున్న వేమన్నగారికి చాటు, మాటు పనికిరాదు.

"కొంపలోన మరుగు, కోకలోన మరుగు
కన్నతల్లి మరుగు, కడుపు మరుగు
ఇన్నిమరుగులందు ఈశుడు మరుగయా!"

అని వారు స్పష్టపరిచారు. ఈ మరుగులు తొలగినప్పుడే తత్త్వం సాక్షాత్కరిస్తుంది.

**8. భూమిలోన బుట్టు భూసారమెల్లను**
**తనువులోన బుట్టు తత్త్వమెల్ల**
**శ్రమములోన బుట్టు సర్వంబు తా నౌను**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

పాంచభౌతికమైన ఈ ప్రపంచం నుంచే సమస్త చరాచర జీవకోటి జనిస్తుంది. మానవుని ఉనికిలోంచే చైతన్యం ఉద్భవిస్తుంది. (అతని చైతన్యాన్ని బట్టి ఉనికి ఉద్భవింపదు). శ్రమలోంచే సర్వం ఉత్పన్నమవుతుంది. శ్రమించనిదే సృష్టి సాగదు. శ్రమలోంచే సంపద వస్తుంది. శ్రమించే వాళ్ళెవరు? శ్రమ ఫలితాన్ని అనుభవించే వాళ్ళెవరు? అన్న ప్రశ్నమీదనే సమాజ వ్యవస్థ ఆధారపడి ఉంది. కొందరు వెట్టిచాకిరి చేయడం కొందరు తేరగా తినడం వేమన్నగారు గుర్తించారు. కొందరివెట్టి కొందరివైభవానికి కారణమని వారికి తెలుసు. అందుకే

"వెట్టి గొలువరాదు విభుడెంత ఘనుడైన"

అని హెచ్చరించారు. సాంఘిక జీవితాన్ని నిర్దేశించే ఆర్థికశక్తుల స్వభావంలోనే సర్వం ఇమిడి ఉంది. ఆ ఆర్థికశక్తుల ప్రభావంలో జీవించే తనువులోనే జీవితతత్త్వం మొలకెత్తుతుంది. వేమన్నగారు ఒక కొత్తజీవిత తత్త్వాన్ని ప్రతిపాదిస్తున్నారు.

**9. వెలయ భూమి తల్లి విత్తన మటు తండ్రి**
**పంట లరయ సుతులు పాడి పరము**
**ధర్మము తనపాలిదైవము సిద్ధము**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

సేద్యానికి, సంసారానికి వేమన్నగారు అభేదాన్ని సూచిస్తున్నారు. కృషి లేకపోతే కుటుంబం లేదు. శ్రామికధర్మాన్ని మించిన దైవం లేదు.

"దేవుడనగ వేరె దేశమందున్నాడె ?
దేహితోడ నెపుడు దేహమందె
వాహనముల నెక్కి వడి దోలుచున్నాడు"

అని వివరించారు. మన ఇంద్రియాలను నడిపించే జీవచైతన్యమే దేవుడు – ఆ దైవ చోదితుడైన నరుడు తనవాళ్ళకోసం పాటుపడాలి. భూమి తల్లివంటిది, విత్తనం తండ్రిపోల్కి, పైరు సంతతివంటిదని, పంటమీద ఆధారపడే పాడి పరలోకసుఖం వంటిది అనే పోలికలు వేమన్నగారు కావాలనే పేర్కొన్నారు.

**10. పోల్కి జూచి తెలివి పూర్వాపరంబుల**
**తడుపు, గుడుపు నడుపు తత్త్వమెరిగి**
**నడువనేర్చి నట్టి నరుడు గృహస్థుండు**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

సమాజజీవితంలో చాలా సామ్యాలున్నాయి. ఆ పోలికలను గుర్తించి సమన్వయం చేసుకొని జ్ఞానంయొక్క పూర్వాపరాలను, స్నానాదికాలైన శుచి శుభ్రతలు, భోజనాదికాలైన ఆహారనియమాలు, ఆచారవ్యవహారాదికాలైన జీవన ప్రవర్తన తత్త్వాన్ని తెలుసుకొని బ్రతుక నేర్చినవాడే గృహస్థుడు. నడవడికి వినికిడి కూడా అవసరం. పోలికలను సమన్వయం చేసుకోవడానికి అనుశ్రుతంగా వచ్చే జ్ఞానంకూడా అవసరం.

"శ్రవణపుటములున్న సార్థక్య మేమిరా?
వినగవలయు పెద్దలనెడివన్ని!
వినగ వినగ నీకు విశదంబు తత్త్వము"

అన్నది వారి అనుభవం. తమ అనుభవాలనుంచి గుణపాఠం నేర్చుకొన్నారు. కనక వర్ణాశ్రమధర్మాలలో వర్ణవిభేదాలను చేస్తూనే సమాజానికి అత్యవసరమైన గృహస్థాశ్రమాన్ని కొనియాడుతున్నారు. వారి బోధనలన్నీ గృహస్థులను ఉద్దేశించి చేసినవే.

**11. సుగుణవంతురాలు సుదతియై యుండిన**
**బుద్ధిమంతులగుచు పుత్రు లొప్ప**
**స్వర్గ మేటికయ్య సంసారి కింకను**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

భార్య అనుకూలవతి అయితే, కొడుకులు గుణవంతులైతే ఇంటినిమించిన స్వర్గం లేదు. సంసారాన్ని మించిన చక్కనియోగం మరొకటి లేదు. మన వేదాంతులు మంత్రయోగం, హఠయోగం, రాజయోగం, లయయోగం అనే నాలుగు యోగాలను చెప్పారు. వీటికి భిన్నమైన సంసారయోగాన్ని వేమన్నగారు బోధిస్తున్నారు.

"వెతలు దీర్చువాడు వేదాంతవేద్యుండు
రతుల నేలువాడు రమణుడగును
సతిని బెనగువాడు సంసారయోగిరా!"

అని నిర్వచించారు. ఈ యోగంముందు మిగతావి దిగదుడుపే; నిష్ప్రయోజనాలే! యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణ, సమాధులనే హఠ యోగ సాధనాలలో యమ నియమాలను తప్ప మిగతావాటిని కసరత్తుగానే వేమన్నగారు భావించారు.

"ఆసనము పన్ని అంగంబు బిగియించి
యొడలు విరుచుకొనెడు యోగమెల్ల
జెట్టిసాముకన్న చింతాకు తక్కువ"

అని నిస్సంకోచంగా నిందించారు.

"కడుపు బోరగించి, కన్నులు ముకుళించి
బిర్రబిగుసుకొన్న బీదయోగి
యమునిబారిగొర్రె యతడేమి సేయును"

అని ఈసడించారు. దేహంలోని మలినాన్ని పోగొట్టే ధౌతితాళి వజ్రోళివంటి కర్మలను నిందించారు.

"ముక్కువ్రేళ్ళ గ్రుచ్చి మురికి పోవగదోమి
కచ్చనీరు నించి కడిగి కడిగి
డొక్క తోమినంత దొరకునా మోక్షంబు"

అని ఆక్షేపించారు. యోగులమని చెప్పుకోనేవాళ్ళలో సైతం భోగలాలసత్వం కనబడుతుంది.

"వేషభాష లెరిగి కాషాయవస్త్రాలు
కట్టగానె ముక్తి కలుగబోదు
తలలు బోడులైన తలపులు బోడులా?

అని ప్రశ్నించారు.

"మతము దారి మరచు మధురాధరము చూచి
మగువరూపు జూచి మనసు మరచు
యోని జూచి సర్వయోగంబు మరచురా!"

అని సత్యాన్ని చెప్పారు. కామం మానవనైజం, సంసారానికి ఈ తృతీయ పురుషార్థం ప్రాణం. అందుకే –

"కామి గానివాడు కవి కాడు, రవి కాడు
కామి గాక మోక్షగామి కాడు
కామియైనవాడె కవి యౌను, రవి యౌను"

అని తేటతెల్లంచేశారు. త్రిమూర్తులంతవాళ్ళే ఆడదాన్ని వదలలేకపోయారని –

"పడతి మోసె నొకడు, పడతి మేసె నొకడు
పడతి నెదను బెట్టి బ్రతికె నొకడు
పడతికొరకు నిట్లు పలుపాట్లు పడిరయా!"

అని ఆలి అవసరాన్ని తెలియజేశారు.

**12.** **ఇంటియాలి విడిచి ఇల జారకాంతల**
**వెంట తిరుగువాడు వెఱ్ఱివాడు**
**పంటచేను విడిచి పరిగ లేరినయట్లు**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

కామం కట్టుకన్న పెళ్ళాంతోనే తీర్చుకోవాలి. వెలయాలి వెంటపడ్డవాడు వెర్రివాడు. విరగపండిన సొంత చేను విడిచి పరులపొలాలలో పరిగలు ఏరుకొంటే ఏం లాభం? భార్య నల్లగా వుందని కొందరు తెల్లగా ఉన్న వేశ్యవద్దకు వెళతారు.

"ఒడలు నల్లనైన నోర్చెడి యిల్లాలు
గుణము గల్గియున్న కోటి సేయు
యెనుముపాలు రోతయనవచ్చునా?"

అని వేమనగారు ప్రశ్నిస్తున్నారు. గేదెలు నలుపైతే పాలు నలుపా? ఇంతకీ ఇల్లు దోచియివ్వకపోతే వెలయాలు దగ్గరకు చేరనివ్వదు.

"కడుపునిండ తవుడు గంపలో బెట్టక
చన్ను ముట్టనీదు తన్ను బర్రె
వారకాంత విటుని వలచునా యూరక?"

అని సొమ్ములుంటేనే షోకులు లోకంలో సాగుతాయన్నారు. ఇహంలోనే కాదు, పరంలోకూడా వెలయాలు వేమనగారి దృష్టిలో హీనమే.

*"లంజకొరకు మేకనంజుడు తినసాగి*
*యజ్ఞమెల్ల కామయజ్ఞమాయె*
*మొదట సోమయాజి తుద కామయాజిరా"*

*అని దెప్పిపొడిచారు. అన్యోన్య దాంపత్యంలో ఆశను ప్రశంసించారు.*

"భార్యమీద నాశ పరగు పురుషునకు
మగనిమీద నాశ మగువ కుండు
శివునిమీద ఆశ సిద్ధున కుండురా"

అని చెప్పారు.

"కరగకరగ బుట్టు కనకంబునకు వన్నె
పెనగపెనగ బుట్టు ప్రేమ సతికి"

అని దాంపత్యమే ప్రేమ జనించడానికి కారణమన్నారు. ఆ వలపులోని తీపి గొప్పదన్నారు.

**13. వలపు గలిగెనేని వనజాక్షి యధరంబు**
**పంచదారకుప్ప పాలలప్ప**
**చూతఫలరసంబు జుంటితేనె సమంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

తా వలచింది రంభ! ఆ మాటకొస్తే అంతకన్నామిన్న, అందుకే ఆమె మోవి తేనె అంతరుచి. ఆ పెదవి రాచపదవి. అది తీపులన్నిటికన్నా తీపి.

"తీపికెల్ల దీపి దెలియంగ బ్రాణంబు
బ్రాణ వితతి కన్న పసిడి తీపి
పసిడికన్న మిగుల పడతిమాటలు తీపి"

అన్నది సత్యం. ఆ తియ్యదనానికి కారణం వలపు. ఆ వలపు తొలగితే అదే పెదవి వగరు, కసటు, వెగటు.

"వలపు తీరెనేని వనజాక్షి యధరంబు
ములక పంటిగిజరు, ముష్టిరసము
చింత పొంత యగును, జీడిసమానమౌ"

అని వేమన్నగారే చెప్పారు.

వలపు కలగడానికి, నిలవడానికి మగవాడి ప్రయోజకత్వం కూడ ముఖ్యకారణం.

"కూలినాలి చేసి గుల్లాముపని చేసి
తెచ్చిపెట్టెనేని మెచ్చు నాలు
చిక్కుపడ్డ వేళ చీకాకు పరచురా"

అని చెప్పారు. ఉత్తరోత్తరా గురజాడ అప్పారావుగారు కూడా "డబ్బుతేలేనట్టి నరునకు కీర్తిసంపద లబ్బవోయ్" అని స్పష్టపరిచారు. ఆర్జన వుంటేనే అంతా ఆదరిస్తారు.

"ఆపద గలవేళ నరసి బంధుల జూడు
భయమువేళ జూడు బంటుతనము
పేదవేళ జూడు పెండ్లాము గుణమొల్ల"

అని వేమన్నగారు చాటుతున్నారు. కలిమిలేములు కలసిపంచుకొన్నదే నిజమైన మగనాలు; గృహలక్ష్మి.

**14. ఆలివంక వారు ఆత్మబంధువు లైరి**
**తల్లివంక వారు తగిన పాటి**
**తండ్రివంక వారు దాయాది పగవారు**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

అత్తింటి వాళ్ళెప్పుడూ అల్లుడికి అయినవాళ్ళే. మేనమామలు మేలుకోరే వాళ్లయినా అంతంత మాత్రమే. తండ్రివంకవారు దాయాదులు; అందుకే శత్రువులు. ఆలివంక వారు తల్లివంక వారు ఆప్యాయంగా కట్నాలు కానుకలూ ఇచ్చేవాళ్లు. తండ్రివంక వారితో ఆస్తి పాస్తులు పంచుకోవాలి. అందుకని తగువులు పెట్టుకోవాలి. రచ్చకెక్కాలి. రాజీపడాలి. అన్నీ చిన్నచిన్న సణుగులతో చీకాకులు ప్రారంభమవుతాయి. అవే చాల బాధపెడతాయి.

“చెప్పులోనిరాయి, చెవిలోని జోరీగ
కంటిలోని నలుసు, కాలిముల్లు
ఇంటిలోని పోరు ఇంతింత కాదయా!”

అని వేమన్నగారు చెప్పారు. గులకరాయి, జోరీగ, నలుసు, ముల్లు చాలాచిన్నవే. అయితే చెప్పులోనూ, చెవిలోనూ, కంటిలోనూ, కాలిలోనూ పడి చాలా యిబ్బంది పెట్టేస్తాయి. ఇంటిలోని పోరు చినికిచినికి గాలివాన కాగలదు. అప్పుడు వేరులు పడాలనిపిస్తుంది.

**15. ఆలి మాటలు విని అన్నదమ్ముల రోసి**
**వేరె పోవువాడు వెఱ్ఱివాడు**
**కుక్కతోక బట్టి గోదావ రీదువా**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

చేపట్టిన చెలి చెవినిల్లు కట్టుకొని చెప్పేవన్నీ తలకెక్కుతాయి.

“పనసతొనలకన్న, పంచదారలకన్న
జుంటితేనెకన్న జున్నుకన్న
చెరకురసముకన్న చెలిమాట తీపి”

కనుక జీవితంలోని చేదునిజాలు అప్పుడు కనబడవు. ఆలిమాటలు విని అన్నదమ్ములను ఏవగించుకొని వేరింటికాపురం పెట్టడం వెఱ్రితనమని వేమన్నగారి మతం. ఇది కుక్కతోక పట్టుకొని గోదావరినీదడం వంటిది. ఏ ఆర్థిక వ్యవస్థలోనైనా కలిసి పాటుపడకపోతే సంపద ఉత్పత్తికాదు. ‘ఉర్విజనులందరికీ ఒక్క కంచం’ పెట్టమనే వేమన్నగారు అన్నదమ్ములను వేరుపడ మనలేరు. ఆలికి నచ్చచెప్పి సర్దుకపోవడం వారికి అభిమతం.

“ఆలి వంచలేక యధమత్వమున నుండి
వెనుక వంతు ననుట వెఱ్రితనము
చెట్టు ముదరనిచ్చి చిదిమిన బోవునా!”

అని వారిప్రశ్న. ఆలిని వంచడం అంటే అది నిర్దాక్షిణ్యంగా కాదు; ప్రేమతోనే రమణికి రమణుడు రక్షగా వుండాలి.

"కావవలయు మగడు కాంత నెల్లప్పుడు
కావలేనినాడు చావవలయు
కాపులేని దాని కాపుర మగుదురా"

అని వేమన్నగారి హితోపదేశం, మొదటికెప్పుడూ మోసం రాకూడదు. మనసు విరిగేటంత మాటా మాటా అనుకో కూడదు.

"ఇనుము విరిగెనేని యినుమారు ముమ్మారు
కాచి యతకవచ్చు క్రమముగాను
మనసు విరిగె నేని మరి చేర్చరాదయా?"

అని వార్నింగ్. ఇంటిపోరువల్ల గుండె కొంచెం గాయపడవచ్చు. అది చిన్నచిల్లిలాంటిది.

"కుండచిల్లుపడిన గుడ్డదోపగవచ్చు
పనికి వీలుపడును బాగుగాను
కూలబడిన నరుడు కుదురుట అరుదయా?"

అని కాపురాన్ని కుదుటబర్చుకునే ఉపాయం చెప్తున్నారు.

**16. తల్లిదండ్రి మీద దయలేని పుత్రుండు**
**పుట్టెనేమి? వాడు గిట్టెనేమి?**
**పుట్టలోన జెదలు పుట్టవా గిట్టవా**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

ఆలిమాటలు విని అన్నదమ్ములతో కలహించకూడదని చెప్పినట్లే, తల్లి దండ్రులపట్ల దయతో వర్తించమంటారు వేమన్నగారు. జన్మమిచ్చిన వాళ్లపై జాలీ, ప్రేమా లేనివాడు పుట్టినా ఒకటే చచ్చినా ఒకటే. వాడి బ్రతుకు పుట్టలోని చదల వంటిది. అవి పుడితే ఎంత? చస్తే ఎంత? వేమన్న దృష్టిలో తండ్రి కన్నా తల్లే ముఖ్యం.

"తల్లి నెరుగువాడు దైవంబు నెరుగును
మన్ను నెరుగు వాడు మిన్ను నెరుగు
మిన్ను మన్నెరిగిన తన్నుతా నెరుగును"

అన్నది వారి తత్త్వం. తనకు, తన ప్రపంచానికి ఉత్పత్తి స్థానమైన తల్లిని తెలుసుకొంటే దైవాన్ని తెలుసుకొన్నట్టే. తన ఇహానికి కారణభూతమైన ఈ లోకాన్ని తెలుసుకొంటే పరానికి ఆధారమైన ఆకాశం అర్థమవుతుంది. తన ఇహ పరాలను అవగాహన చేసుకొన్న వాడికే ఆత్మజ్ఞానం అలవడుతుంది. నవమాసాలు మోసి, కనిపెంచిన తల్లిని తండ్రిమాట పైన సైతం బాధించకూడదు.

"తండ్రిమాటలు వివి తల్లిని తెగటార్చి
పరశురాము డేమి ఫలము గనియె
నిలువ నీడ లేక మలయాద్రి నుండడా?"

అని సూటిగా ప్రశ్నిస్తున్నారు. మాతృ స్వామ్య సమాజం నుండి పితృస్వామ్య వ్యవస్థలోకి మారిన మన పూర్వులు స్త్రీలకు 'హక్కులు లేకుండా చేశారు. ఉపనయనం వేదపఠనం వంటివి ద్విజులు తమ అక్కచెల్లెళ్లకు లేకుండా చేశారు.'

"తల్లిగన్న తల్లి, తన తల్లి పిన తల్లి;
తండ్రిగన్న తల్లి తాతతల్లి
యెల్ల శూద్రులైరి యేటి బాపడు తాను?"

అని ప్రశ్నించారు. తాత తండ్రుల కాలంలో ఎలా ఉన్నా తనకాలంలో తల్లికి మొదటి పీట వెయ్యమన్నారు.

**17. తల్లి బిడ్డలకును దగవులు పుట్టించు**
**ధనము సుఖము గూర్చదని వచింత్రు**
**కాని గడనలేక గడుచుట యెట్లురా**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

తల్లిబిడ్డలమధ్యసైతం శత్రుత్వాన్ని పెంచుతుంది కనుక డబ్బు పాపిష్టిదంటారు లోకులు.

"మాతా పుత్ర విరోధాయ హిరణ్యాయ నమో నమః"

అని దండం పెట్టేస్తారు. తనబుద్ధి బాగుంటే ధనమేం చెయ్యగలదు? పసిడి చెడ్డదని ఆర్జించకుంటే సంసార గడవదు. గడించాలి. దాన్ని సద్వినియోగం చేయాలి.

"ధనము లేకయున్న ధైర్యంబు చిక్కదు
ధైర్య మొదవదేని ధన మొదవదు
ధనము ధైర్య మరయ దగభూమి నరులకు"

అని చెప్తూ వేమన్నగారు.

"ధనమూల మిదంజగత్" "ధైర్యం సర్వత్ర సాధకం"

అన్న రెండు లోకోక్తులలోని సత్యాన్ని మిళితం చేశారు. జీవనోపాధికి ధనార్జన చేయాలి. ధనలాభకోసం ఏంచేయాలి? పూజలు, వ్రతాలు చేయమంటారు పురోహితులు. నోములు నోస్తే లేమి పోయి కలిమి కలుగుతుందా? కల్ల.

**18. వ్రాతకంటె హెచ్చు వరమీదు దైవంబు**
**చేతకంటె హెచ్చు వ్రాత లేదు**
**వ్రాతకజుడు కర్త చేతకు దాగర్త**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

చేసుకొన్న దానికన్న చిన్న మెత్తు దేవుడుకూడా ఇవ్వలేదు. దీన్నే లోకులు వ్రాతలంటారు; బ్రహ్మలిఖితం అంటారు. అయినా చేతకంటే హెచ్చు రాతలేదు. తలవ్రాతకు బ్రహ్మదేవుడు కర్త కావచ్చు గానీ తన చేతకు నరుడు తానే కర్త. అయితే 'కీలెరిగి వాత, వీలెరిగి చేత' అని సామెత చెప్పినట్టు.

"చేయ దగినవేళ జేసెడికార్యంబు
వేగపడి యొనర్చ విషమ మౌను"

అని వేమనగారు హెచ్చరిస్తున్నారు. దేవుడంతటి వాడైనాసరే పాటుపడనిదే పని జరగదు.

"అగ్నిబాణ మేసి యంబుధి నింకించి
రాము డవలి కేగరాగ, నిలిచి
చెట్లు గిరులు తెచ్చి సేతువు గట్టడా"

అని వేమనగారు ప్రశ్నిస్తున్నారు. మహిమతో మహాసముద్రాన్ని ఇంకించిన వాడైనాసరే మానవ ప్రయత్నంతో సేతువు కట్టందే అద్దరి చేరుకోలేదు. పూజ వల్లకాదు, పూనికవల్ల ఏదైనా నెరవేరుతుంది.

**19. రాళ్ళు దెచ్చి నరులు రమ్యమౌ గుడి గట్టి**
**రాతి ప్రతిమ చేసి ఖ్యాతిగాను**
**దేవుడనుచు మ్రొక్క దీవించి పల్కునా**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

మనుష్యుడు చేసిన దేవుళ్ళకు మహిమ లెక్కడివి? తమకు లక్షలూ మోక్షమూ కోరుకొంటూ రాళ్ళకు రాసులు పోస్తారు మూఢులు. తాము నిర్మించే దేవతలకు తమ కాళ్ళతొక్కిళ్ళు, ఉలిదెబ్బలు తప్పవు.

"గట్టురాళ్ళ దెచ్చి కాలచేతుల ద్రొక్కి
కాసె యులుల చేత గాసి చేసి
మొరపరాళ్ళ కెరగు మొప్పెలనే మందు!"

అని వేమన్నగారు బాధపడ్డారు. అయితే మొప్పెలకు చెప్పవలసినది చాలా ఉంది.

"రాతిబొమ్మ కేల రంగైన వలువలు
గుళ్ళు గోపురములు కుంభములును
కూడు గుడ్డ తాను కోరునా దేవుడు!"

అని అడుగుతున్నారు. మరెవరికి కూడు గుడ్డా? అర్చకులకే! పూజార్లకే.

"గుడులు దేవతలని గుర్తులు గావింత్రు
ముష్టిబాప లనుచు మూర్ల నేల
మొప్పెలకును దారి చెప్పగా ప్రాజ్ఞత"

అని మూర్ఖులకు మంచి మార్గం చూపదలిచారు. లేనినాడు దైవాన్నీ అడగొద్దు; దాతనీ అడగొద్దు. అప్పూలూ చేయకు.

**20.** **అప్పు దీయ రోత హరిహరాదుల కైన**
**మొప్పెతోడ మైత్రి మొదలె రోత**
**తప్పు బలుక రోత తాకట్టు కడురోత**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

అప్పుచేసిన వాడి బ్రతుకు అసహ్యకరమవుతుంది.

"వడ్డి కిచ్చువాని వాకిట బడుదురు
బడ్డు చిక్కి వెనుక బాధపడిన
దుడ్డు కాసె కాని దొడ్డ ఈ వివ్వరు"

అన్నది సత్యం. వడ్డీవ్యాపారి చేతుల్లో పడితే బడ్డులాంటి మోకు కాళ్ళకు కట్టుబడ్డట్టే. ఇంతకీ వడ్డీవ్యాపారి ఇచ్చేది గొప్పదానమా? ఏవో నాలుగు డబ్బులే.

"రచ్చకట్టుక్రయము ద్రవ్యమంతయు నివ్వ
చెలగ క్రయము సొమ్ము చెల్లునట్లు
వరుస లిఖితమునకు వడ్డికున్న క్రమము
నరయ హాని దెచ్చు నౌర వేమ"

అని అర్థిక మర్మాలను చెప్పారు. కుదువబెట్టు దారి కొంత పద్దుకు నష్టి; పరగనందు మీద బ్రతుకు నష్టి అన్నది అప్పుచేసేవాడి విషయంలో సత్యం. అప్పిచ్చేవాడు హాయిగానే ఉంటాడు. కుదవ పెడితే 'పట్టువారికి నొకతుష్టి గలదు భువి' అన్నది పరమసత్యం. తాకట్టు వాకట్టు చేసుకోడానికి తప్పులు పలుకుట రోత. అందుకే అప్పులేనివాడె అధికసంపన్నుడు'. అప్పులున్నా లేకపోయినా పన్నులు తప్పవు.

**21. ఒరుల కొరకు భూమి నొరచెడు వారును**
**అవనిపతికి వశ్యులైనవారు**
**పాలవంటివారు పన్ను బెట్టెడివారు**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

ధనస్వామ్యవ్యవస్థలో భూస్వామికి వశ్యులైన వ్యవసాయకార్మికులే పంటని నిజంగా ఉత్పత్తిచేసేవాళ్లు. ఈ పన్నులు పెట్టే ప్రజలు పాలవంటివారు. పన్నులుకూడా పాలవంటివే. ఆపాలు మరగబెడితే మీగడ, ఆ మీగడలోంచే వెన్న వస్తాయి. (ఈ పద్యంలో నాలుగోపాదంలో సంపూర్ణ మకుటం కాక "వాకెరుగరు కాపువారు వేమ" అనే పాఠం ఉంది. పన్నులు కట్టే పేదలెప్పుడూ నోరులేని వాళ్లే). కాపులు కట్టుకొనవలసిన పన్నుల పద్దులు రాసుకొనేవాళ్ళూ రాబట్టే వాళ్ళూ కరణాలు – వీళ్ళు క్రూరంగా వర్తిస్తే పగబడితే కాపు ఊరు విడిచిపోతాడు.

"కాపు లేనియూరు కరణమ్మునకు కీడు
కరణము పగచేత కాపుకీడు
కాపులు కరణాలు కావడికుండలు"

అని ఆర్థికవ్యవస్థలోని మూలసూత్రాన్ని చెప్పారు.

**22. భూపతికృపనమ్మి భూమి జెరచువాడు**
**ప్రజల యుసురు దాకి పడును బిదప**
**నెగురవేయ బంతి నెందాక నిల్చురా**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

మధ్యయుగాలలో భూమంతా రాజుదే అనే విశ్వాసం మన ఆర్థిక వ్యవస్థలో ఉండేది. ఆ భూఖండాలను రాజు ఎవరికిస్తే వాళ్ళు భూస్వాములవుతారు. రాజాశ్రయం ఉందికదా అని భూస్వాములూ, కరణాలూ భూమిని చెరచి కాపును కష్టపెడితే ప్రజలఉసురు తగిలి చెడిపోతారు. ఎగరేస్తే బంతి ఎంతకాలం గాలిలో ఉండగలదు. సేద్యగాడు లేనిదే ఏ భూస్వామీ గాదెలు నింపుకోలేడు. అందుకే

"భూమి నాది యన్న భూమి ఫక్కున నవ్వు
దానహీను జూసి ధనము నవ్వు
కదనభీతు జూచి కాలుండు నవ్వురా!"

అన్నారు వేమన్నగారు. ఆర్థికవ్యవస్థను కరతలామలకం చేసుకొన్నవాళ్ళకి ఈ కీలకం తెలుస్తుంది. కనుకనే కృష్ణదేవరాయలువారు యథార్థాన్ని చెప్పారు. "నృపుల పద హల రేఖలకెల్ల మా భుజాగ్ర హలరేఖలె మూలమనుచు కోటికొండలుగ ధాన్యరాసులు పండువీట సుజన భజనైక విఖ్యాతి శూద్రజాతి" అని పురవర్ణన చేశారు. రాజుల అరికాళ్ళలో ఉండే హలరేఖలకు, రైతుల భుజాలపైన ఉండే హలరేఖలే మూలమనే మూలసత్యం కర్షకులకు చెప్పవలసిన బాధ్యత కవిది. ఆ ప్రజలు కదనభీతులు కానప్పుడే ప్రజాకంటకులకు ప్రజల ఉసురు తగులుతుంది.

**23. లక్ష్మి యేలినట్టి లంకాధిపతిపురి**
**పిల్లకోతిఫౌజు కొల్లపెట్టె**
**చేటుకాలమైన చెరుప నల్పులె చాలు**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

ఎంతటి మొనగాడైన చెడ్డపనులు చేస్తే చేటుకాలం రాకతప్పదు.

"కోరి ద్రుపదుని పుత్రి కొప్పుపట్టీడ్చిన
సింహబలునిచావు చెప్పదరమె
ముగియుకాలమునకు మొనగాడు నీల్గడా?"

అని ప్రశ్నిస్తున్నారు. సింహబలుణ్ణి సమానబలుడు చిత్రవధ చేశాడు. అయితే ఎవరో ఇల్లాలిని చెరపట్టిన రావణునిమీద పిల్లకోతిఫౌజు వెల్లువలాగ వచ్చింది. కదనభీతులు కాని అల్పులైనాసరే అధికుణ్ణి అంతం చేయగలరు. చీమకన్నా అల్పజీవి సృష్టిలో లేదు.

"చీమ కుట్టెనేని జివు కనిపించును
జీమ యెంత? దాని జీవమెంత?
చీమవంటివారి సృష్టిలో నెరుగరా?"

అని వేమన్నగారి ప్రబోధం. కూటికి అల్పులవల్ల కాక, గుణానికి అల్పులైన వాళ్ళవల్లనే లోకహాని.

**24. అల్పబుద్ధివాని కధికార మిచ్చిన**
**దొడ్డవారి నెల్ల దొలగగొట్టు**
**చెప్పు దినెడు కుక్క చెరుకు తీపెరుగునా**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

అల్పుడు అధికారంలోకి రాగానే తనకు వంతపాడేవాళ్ళనే కొలువులో చేర్చుకొంటారు.

"దుండగీడు కొడుకు, కొండీడు చెలికాడు
బందరాజునకును బడుగు మంత్రి
కొండముచ్చునకును కోతియె సరియగు"

అని తులువల కొలువుకూటాన్ని వేమన్నగారు వర్ణించారు. ఇటువంటి రాజును అటువంటి సేవకులే మెచ్చుకుంటారు.

"ఓగు నోగు మెచ్చు నొనరంగ నజ్ఞాని
భావమిచ్చి మెచ్చు పరమలుబ్ధు
పంది బురద మెచ్చు పన్నీరు మెచ్చునా?"

చెడ్డవాళ్ళను చెడ్డవాళ్ళే ఆకాశానికెత్తుతారు. 'నీతిహీనునొద్ద నిర్భాగ్యులుందురు' ఈ అల్పులను స్వల్ప ప్రతిఫలానికి కవులు కీర్తిస్తారు.

"తోటకూరకైన, దొగ్గలికైనను
తమిదకుడుముకైన తవుటికైన
కావ్యములను జెప్పు గాండ్యాలు ఘనులైరి"

(దొగ్గలి అంటే చిర్రికూర; తమిదకుడుము అంటే చోడిరొట్టె; గాణ్డు అనే కన్నడ పదానికి అళు అన్న తమిళపదం కలిపి ఉమ్మడితిట్టుగా 'గాండ్యాలు' అనేమాట వాడేవారేమో. నిఘంటువులో ఈ మాట కనబడదు) – ఈ చెడ్డవాళ్ళ రాజ్యం చిరకాలం సాగదు.

"చెడ్డవాని మిగుల చెరచును దైవంబు
అడ్డపడదు వాని కాపదైన
చెడ్డచేను జూచి రెడ్డి తా మెచ్చునా!"

అని వేమన్నగారు స్పష్టపరుస్తున్నారు. అయితే పాలకులకు ముందు అధికారం ఇచ్చి తరువాత తొలగించడం అవివేకం.

"కూర యుడుకువెనుక కూడునా కసువౌర
ఎరుక గల్గి మునుపె యేరవలయు
స్థలము దప్పువెనుక ధర్మంబు పుట్టునా?"

పచనం చేయడానికి ముందే పాకాన్ని శుద్ధిచేయాలి. పట్టంకట్టడానికి ముందే పాలకుడి అర్హతలు చూడాలి.

**25. ఎరుక లేని దొరల నెన్నాళ్లు కొలచినా**
**బ్రతుకు లేదు వట్టి భ్రాంతి గాని**
**గొడ్డుటావు పాలు గోకితే చేపునా**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

తెలివి లేని దొరను కొలిచినందువల్ల బ్రతుకుతెరువులేదు. అసలు బ్రతుకు తెరువు కోసమేగా ఆ ఊడిగం –అది సిద్ధించనప్పుడు కంచిగరుడసేవ దండుగ.

"విడువవలయు నూరు విశ్రాంతిగా కున్న
విడువవలయు నాలి విధము చెడిన
విడువవలయు రాజు వితరణిగాకున్న"

అన్నది వేమన్నగారి మతం. ఆనాడు ప్రజలు అంతకన్న మరేం చేయలేకపోయేవారు.

"అడిగిన జీతం బియ్యని
మిడిమేలపు దొరను గొలిచి మిడుకుటకన్నన్
వడిగల యెద్దులు గట్టుక
మడి దున్నుక బ్రతుకవచ్చు మహిలో సుమతీ."

అన్నది ఆనాటి మనస్తత్వం.

**26. అనువు గాని చోట అధికుల మనరాదు**
**కొంచె ముండు టెల్ల కొదువ కాదు**
**కొండ యద్దమందు కొంచెమై యుండదా**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

అధికారస్థానాలలో ఉన్నవాళ్ళు అల్పులైనా బలవంతులు. ఆ బలం స్థానబలిమి. చాలా గొప్పది.

"నీళ్ళలోన మొసలి నిగిడి యేనుగు బట్టు
బయట కుక్కచేత భంగపడును
స్థానబలిమి కాని తనబలిమి కాదయా!"

అన్న సత్యం విస్మరించకూడదు. అందుకే అనువుగానిచోట ప్రజలు తమ ఆధిక్యం ప్రకటించుకోకూడదు. వాళ్ళు కొద్దిగా తగ్గి ఉంటే తప్పులేదు. అంత కొండసైతం అద్దంలో కొద్దిగానే కనబడుతుంది. అనువుగానివేళ "విజయుడిమ్ముదప్పి విరటుని కొలవడా?" కనుకనే సమయం వచ్చేదాకా తగ్గాలి. "బలిమి లేనివేళ పంతాలు చెల్లవు" బలిమి సంతరించుకోవాలి.

**27. పూర్ణమైన తనదు భుజబల్మి చూడక**
**భువిని చెడుగుతోటి పోరరాదు**
**పాలకుండచెంత పగులును నారాయి**
**విశ్వవిదాభిరామ వినుర వేమ**

పాలను మరగించాక చల్లారడానికి ఆ కుండలను రాళ్ళమీద పెడతారు. బాగా మరిగాక గానీ పాలకుండకు ఆసత్తువ రాదు. అలాగే పూర్ణమైన భుజబలం లేని సామాన్యుడు దౌర్జన్యం చేసే రాజును ఎదిరించలేడు. శక్తులు కూడకట్టుకోవాలి. ఆ తరువాతనే సంహారం. (ఈ పద్యంలో మూడవపాదానికి బ్రౌనుదొర గారు అర్థం రాస్తూ – "Is not a stone broken by a pot of milk" అని చెప్పాక కుండలీకరణాలలో - (Boiled milk is set to cool on stone stands which there by are split) అని వివరించారు.

**28. ఐదువేళ్ళ బలిమి హస్తంబు పనిచేయు**
**నం దొకండు విడ్డ పొందు చెడును**
**స్వీయు డొకడు విడిన జెడుకదా పనిబల్మి**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

కలసికట్టుగా ఉంటేనే కార్యాలు సాధించవచ్చు. కష్టాలు ఎదుర్కొనవచ్చు. అయిదువేళ్ళూ ఉన్నప్పుడే చెయ్యి బాగా పనిచేస్తుంది. కుటుంబంలోనూ, కులంలోనూ, వర్గంలోనూ అందరూ సయోధ్యతో ఉంటేనే పనులు జరుగుతాయి. ఒక్క గడ్డిపోచ ఏదీ చేయలేకపోవచ్చు, దేనికి పనికిరాకపోవచ్చు. కొన్ని గడ్డిపోచలు వెంటిపెడితే ఆ మెలిపెట్టిన తాటితో ఏనుగునే కట్టవచ్చు.

"ఐకమత్య మొక్క టావశ్యకం బెప్డ
దాని బలిమి యెంతయేని గూడు
గడ్డి వెంటిబెట్టి కట్టవా యేనుంగు"

అందుకే కుటుంబం నిండుగా ఉండాలి.

**29. తల్లిదండ్రి యన్నదమ్ము లాత్మసఖులు
నెలమి బంధుభృత్యులెల్ల జనులు
గలిగి వర్ధిలంగ ఘనతతో నుండరా
విశ్వవిదాభిరామ వినుర వేమ**

అందరూ కలసి ఉంటేనే ఆనందం. వ్యక్తి సకుటుంబ సపరివారంగా బంధుమిత్ర సమేతంగా అభ్యుదయ పరంపరాభివృద్ధి పొందినప్పుడే ఘనత. వ్యక్తి చుట్టాలసురభిగా ఉండాలి. తనకున్నది ఇతరులతో పంచుకోవాలి.

"ఇచ్చి పుచ్చుకొన్న హితులును మనుమలు
తగ్గులేక యిల్లు తామరవలె
కాచి పూచి పండి కడు రమ్యమై యుండు"

అన్న నిజం తెలుసుకోవాలి. అయితే

"ఇచ్చువాని యొద్ద నీ నివాడుండిన
చచ్చు గాని యీవి సాగనీడు
కల్పతరువు క్రింద గచ్చపొద యున్నట్లు"

సమాజంనుండి ఈ ముళ్ళ దొంకలను తొలగించాలి.

"కలిమి గల్గ నేమి, కరుణ లేకుండిన
కలిమి తగునె? దుష్టకర్ములకును
తేనె కూర్చి ఈగ తెరువరి కీయదా?"

అని గుర్తించుకోవాలి. దుష్టకర్ములకు కలిమి ఉండకూడదు, వాళ్ల సొమ్ము దొంగలపాలు దొరలపాలు అవుతుంది.

"దానములను జేయ ధర చేతు లాడక
బహుధనంబు గూర్చి పాతి పెట్టి
తుదను దండుగ నిడి మొదలుగా చెడు నర్దు"

పాతిపెట్టిన ధనాన్ని రాజులు దండుగ (జుర్మానా)గా స్వాధీనం చేసుకుంటారు.

"చీమలు పెట్టిన పుట్టలు
పాముల కిరవైన యట్లు పామరుడు తగన్
హేమంబు కూడ బెట్టిన
భూమీశుల పాలు చేరు భువిలో"

అని సుమతీశతకకారుడూ ఇదే యథార్థాన్ని చెప్పాడు.

"తా మొరులకు బెట్ట దమకును గలుగును
నడుగ నిడిన దాము నడుగ గలరు
ఇందు నీని వానికెందును గలుగదు"

అన్నది వేమన్నగారి తత్త్వం. ఇహంలో ఇవ్వని వానికి పరం కూడాలేదు. అందుకే ఇహంలో అందరూ ఇచ్చి పుచ్చుకొంటూ పచ్చగా ఉండాలి. పొత్తుగా ఉండడానికి కొన్ని కట్టుబాట్లు అవసరం. అందుకే వేమన్నగారు తమ చరమావస్థలో ఒక మతాన్ని స్థాపించి అనుయాయులకు ఏడుసూత్రాలను విధించారు.*

**29.** **పాల సాగరమున పవ్వళించినస్వామి**
**గొల్లయిండ్ల పాలు కోర నేల**
**ఎదుటి వారి సొమ్ము ఎల్లవారికి తీపి**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

వేమన్నగారు తమ శిష్యులకు విధించిన సూత్రాలలో మొదటిది 'దొంగ తనం చేయకూడదు' అన్నది. తనకున్న వాడు సైతం ఎదుటివారి సొమ్ముకు ఆశపడతాడు. లేనివాడు సరే సరి. కడుపు మండితే దొంగతనం చేస్తాడు. కడుపు నిండకపోతే దొంగతనం చేస్తాడు. అన్ని సామాజిక వ్యవస్థల్లోనూ ఇది నేరమే. దొరికిపోతే శిక్ష పడుతుంది. దొరక్కపోయినా వేమనగారి దృష్టిలో తప్పే.

---

* ఈ సంగతి చెప్తూ ఆ సూత్రాలను కొమ్రరాజు లక్ష్మణరావు గారు ఒక అముద్రిత వ్యాసంలో పేర్కొన్నారు. చూ. రాళ్ళవల్లి వారి "వేమన" పుట. 113.

"దొంగతనము వలన ద్రోహ మెంతయు జేసి
యెవ్వ రెరుగకుండ నిడుముకొన్న
దాము చేయు పనుల దగులకొనరె ముందు"

అని ప్రశ్నిస్తున్నారు. బలంతో విర్రవీగినవాళ్ళు ముఠాగా ఏర్పడి దారి దోపిళ్లూ చేస్తారు.

"దొడ్డవాండ్ర మనుచు ద్రోవ డొంకలు కట్టి
యడ్డమైన జనుల నంటకట్టి
దోచుకున్న యట్టి దోష మెక్కడ బోవు"

అని అడుగుతున్నారు. దొంగబారి నుండి స్వజనులకు రక్షణ కల్పించడం పాలకుల ధర్మం.

"దొడ్డవాడు పెద్ద తోడేలు నైనను
మట్టుజూచి, దాని మర్మ మెరిగి
గొడ్డు గొర్రెనైన గొన చన నీయడు"

ఇది భద్రతకు ఆయువుపట్టు.

**31. చంపదగినయట్టి శత్రువు తనచేత**
**జిక్కెనేని కీడు సేయరాదు**
**పొసగ మేలుచేసి పొమ్మనుటే చాలు**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

'ఎల్లప్పుడూ భూతదయ గలిగి ఉండాలి' అన్నది వేమన్నగారి రెండవ సూత్రం. ఒకడు సమాజానికి శత్రువైతే అతడు ఎందుకలా పరిణమించాడో తెలుసుకొని ఆ పరిస్థితులను తొలగించాలి. అందుకే చంపదగిన నేరం చేసిన వాడికి కూడా పొసగ మేలుచేయాలి.

"జీవి జీవి జంప శివుని జంపుటె యగు
జీవు దరసి తెలియ శివుడు కాడె
భావమందు వేగ పరికించి చూడరా!"

అన్నారు. జీవులందరూ సమానులే. మానవుణ్ణి మానవుడు హింసించకూడదనే వేమన్నగారు నోరులేని జీవాలను వధించడం హర్షిస్తారా? జన్నాలలో వేద దేవతలకు, జాతరలలో గ్రామదేవతలకు బలులు వేయడం వారికి అభిమతం కాదు.

"కడగి జగమునందు కడుసోమయాజి తా
పోతురాజు తోడ బుట్టినాడు
మేకపోతులకును మిత్తియై తలపంగ"

అని ఎత్తి చూపించారు.

"తోక జంతువులను తొడరి గొంతులు గోసి
మేకపిండు నెల్ల మెడలు విరిచి
కడమవాటి నెల్ల కాల్చుక తిందురు"

అని నిరసించారు. మానవుడు జంతుజాలాన్నే కాదు తన్ను తాను హింసించుకోకూడదు.

"కూడు బెట్టకున్న కుక్షిలో జఠరాగ్ని
భక్షణంబు చేయు కుక్షి మలము
కూడు విడిచి మలము కుడుచురా యుపవాసి"

అని అవహేళనం చేశారు. పూర్తిగా ఉపవాసాలు ఉండలేని వాళ్ళు ఒక్క పొద్దులుంటారు. అందులోనూ ఆత్మవంచనే వుంది.

"ఒక్క ప్రొద్దులుండి యొగి నీళ్ళలో మున్గి
కూడు వండి వేల్పు కుడువ మనుచు
దాని నోరు కట్టి తమరె తిందురు కదా!"

ఎందుకీ ఆత్మహింస. హింసను బోధించేది ఏదైనా వేమన్నగారికి అసహ్యమే.

"పంచమ నిగమంబు భారతంబగునని
పొగడి రేల జనులు బుద్ధిలేక
హింస కార్యము తమకిష్ట మే లాయెరా"

అని నిలదీసి అడుగుతున్నారు.

**32. అంతరంగ మరయ హరు డౌను గురు డౌను**
**యంతరంగ మెరుగ నలవి కాదు**
**యంతరంగ మెరుగ నతడెపో శివుడయా**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

'ఇతరుల మనసు నొప్పించకూడదు' అన్నది వేమన్నగారి మతంలో మూడవ సూత్రం. అంతరంగాన్ని తెలుసుకొంటే అదే నిజమైన విద్య. మనసు తెలుసుకొనడానికి మనసు ఉండాలి.

"మనసు గలుగువాడు మహనీయ తేజుండు"వాళ్ళు మనసును చూసి గెల్చి సంకల్పసిద్ధిని పొందుతారు. "చెట్టు బెట్ట ఫలము చేకూరకుండునా" ఫలసిద్ధికి పరులలో తప్పులు చూపించినా వాళ్ళకు చిత్తక్షోభ కలిగించకూడదు.

"పరుల దిట్టినంత బాపకర్మం బబ్బు
విడువ దెన్నటికిని విశ్వమందు
బరుడు పరుడు కాదు, పరమాత్మ యౌనయా"

అని వేమన్నగారు హెచ్చరిస్తున్నారు. నొప్పింపక తానొవ్వక' సంచరించినా తప్పించుకు తిరగడం వారి తత్త్వం కాదు.

"మనసు నిర్మలు డయి మంచి నీతులు దెలిసి
భయము లెల్ల దీర్చి భద్ర మగుచు
తావు జేర్చిన వాడె తారకబ్రహ్మంబు"

అన్నది వారి మత ప్రచారానికి జీవగర్ర, 'మంచిమాటచేత మనసు రంజిల్లును' కనుక తోటివారిపట్ల మంచిగా ఉండాలి.

**33. ఉన్నతావు వదలి యూరూరు దిరిగిన**
**గన్నదేమి నరుడు గ్రాసమునకు**
**దన్ను లోన జూడc దమ మెల్ల వీడును**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

'ఉన్నదానితో తృప్తిచెంది ఉండాలి' అన్నది వేమనగారి సూత్రావళిలో నాలుగవది. 'ఆశకన్న దుఃఖ మతియశంబుగ లేదు' అని తెలుసుకోవాలి.

"చదువులందు పాడిమొదవులందును స్త్రీల
పెదవులందు రాజ్యపదవులందు
ఆశ లుడిగినట్టి యయ్యలు ముక్తులు"

అని విశదం చేస్తున్నారు. ఇహానికి సంబంధించిన వేదవిద్యలు అవసరానికి మించిన ఆలమందలు, పాపహేతువులైన పరస్త్రీ అధరాలు, పతనానికి హేతువైన రాజ్యపదవులు ఆశించడం మంచిదికాదు.

"మోహలోభములను మొనయుట బహుకీడు
మోహ ముడిగె నేని ముక్తుడగును

లోభ ముడిగె నేని లోకంబుల నెరుగు"

అని తెలుసుకోవాలి. ఉన్నది వదులుకొని లేనిదానికోసం ఊళ్ళవెంట వెళ్ళడం వెర్రితనం. దానివల్ల ముక్తిలేదు. ముక్తంటే వేమనగారి ఉద్దేశంలో ఇహలోక సుఖమే.

"ఇహమునందు సుఖము లీడేరగా లేదు
పరము నమ్మె నేని, బ్రతుక నగునె?
మొదట లేని సుఖము తుద నెట్లు కల్గురా!'

అని వారు ఉద్ఘోషిస్తున్నారు.

**34. ఇరుగు పొరుగు వారి కెనయు సంపద జూచి**
**తమకు లేద టన్న ధర్మమేమి**
**ధర్మమన్న దొల్లి తన్నుక చచ్చిరి**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

న్యాయమార్గాలలో కష్టించి ఇతరులు సంపదలు గడిస్తే అసూయపడకూడదు. 'ఇతరులను మత్సరించ కూడదు' అనేది వేమన్నగారి సూత్రాలలో అయిదవది. మయసభను చూసి మత్సరించి సుయోధనుడు భారతయుద్ధానికి కారణభూతుడయ్యాడు. అది ధర్మంకోసం జరిగిన యుద్ధమన్నారు. ఫలితం తన్నుకు చావడమే.

"అల్పసుఖము లెల్ల నాశించు మనుజుడు
బహుళదుఃఖములను బాధపడును
పరమసుఖము నెరిగి బ్రతుకంగనేరడు"

అని వేమన్నగారు చింతిస్తున్నారు. పరుల సుఖమే పరమసుఖము. పరుడంటే పరమాత్మ అని వారి సిద్ధాంతం. మత్సరాన పుట్టే దురాశ మహాహాని!

"ఇంద్రు డీహ కల్గి హీనుడై పోవడా
మరుడు ఈహ కలిగి మన్ను గాడె
బ్రహ్మ కీహ గల్గి బలుతల బోవడె"

మదించిన మత్సరం మహనీయులనైనా పడగొడుతుంది. మనుష్యులనగా ఎంత?

**35. కోపమునను ఘనత కొంచెమై పోవును**
**గోపమునను మిగుల గోడు చెందు**
**కోప మడచెనేని కోరిక లీడేరు**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

ఈసు అసూయలవల్ల కోపం ప్రజ్వరిల్లుతుంది. కోపంవల్ల ఉన్నఘనత కూడా సన్నగిల్లుతుంది. కోపం దుఃఖహేతువు. ఆ కోపాన్ని అడచుకొంటేనే కోరికలు సిద్ధిస్తాయి. వేమన్నగారి సూత్రావళిలో అరవది 'కోపం విడవాలి' అన్నదే. వ్యక్తిగతమైన క్రోధాన్నే విసర్జించాలి. సమాజమంతటికీ సమానమైన ధర్మకోపం కాదు వీడవలసింది. అది లేనినాడు దురాచారాలపై దుష్ప్రభుత్వం పై ధ్వజ మెత్తడమే జరగదు. దురన్యాయం జరుగుతున్నప్పుడు ఉత్తములకు వచ్చే కోపంవల్ల లోకోపకారం జరుగుతుంది. ధర్మకోపంలోనే 'మానిషాద' కావ్యం పుట్టింది. 'ధర్మ కోపంతోనే వేమన్నగారు ఇన్ని సూక్తులు చెప్పారు. వారు త్యజించమనేది స్వార్థంతో కూడిన క్రోధం.

> "తన కోపమె తన శత్రువు
> తన శాంతమె తనకు తండ్రి దయ చుట్టంబౌ
> తనసంతోషమె స్వర్గము;
> తనదుఃఖమె నరకమండ్రు తథ్యము"

అని సుమతీశతకకారుడూ చెప్పాడు. కోపంలో మహనీయులు సైతం తను లావు మరిచిపోతారు. సముద్రుడు దారి యివ్వలేదని కోపించి రాముడు బాణంవేశాడు. సముద్రుడు దారికొచ్చాడు. కోపావేశంలో ఉన్నాడు కనుకనే రాముడు తన శౌర్యాన్ని మరచిపోయాడు.

> "అగ్ని బాణమేసి అంబుధి నింకించి
> రాము దవలికేగ లావు మరిచె"

అని వేమన్నగారు హెచ్చరిస్తున్నారు. పరహితార్థం వచ్చేకోపంలో ఈ మరుపు ఉండదు.

**36.** **ఇంటి ఇంటిలోన నీశ్వరు దుండగ**
**నంటి చూడలేక యడవులందు**
**నుంట మే లటంచు నుందురా జోగులై**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

వేమన్నగారి సూత్రాలలో కడపటిది; ఎల్లప్పుడూ ఈశ్వరారాధన చేస్తూ ఉండాలి. అయితే ఈశ్వరుడెవడు? ఎక్కడ ఉంటాడు. ఈ ప్రశ్నకు పలుమార్లు ఒక్కటే సమాధానం వేమన్నగారు చెప్పారు. తనలోనే తత్త్వముంది, ఇంట్లోనే ఈశ్వరుడున్నాడు. అందరిలోనూ ఉన్నాడు. అడవులకు పోనక్కర్లేదు.

"తనువులోనన్న తత్త్వంబు తెలియక;
వేరె యాత్రబోవు వెఱ్ఱివాడు;
గంత మోసి మోసి గాడిద తిరగదా?

అని నవ్వుకొంటున్నారు.

"తనువు నడవి చేసి తనలోనె కూర్చుండి
తపము చేయలేని తపసు లెల్ల
నడవియందు జేరి యలజడి పడెదరు"

అని హెచ్చరిస్తున్నారు.

"గుహలలోన జొచ్చి గురువుల వెదుకంగ
క్రూరమృగ మొకండు తారసిలిన
ముక్తిమార్గ మదియె ముందుగా చూపురా"

అని ఎగతాళి చేస్తున్నారు. ఇంతకీ

"ఇంటిలోన జ్యోతి యెంతయు వెలుగగా
బొరుగువారి యగ్గి కరుగ నేల
తాను దైవమాయె దైవము గొలుచురా"

అని ఈశ్వరాధన రహస్యాన్ని చెప్పారు. కులభేదాలే కాదు. మత భేదాలు కూడా విస్మరించాలి. తనకాలంలో మహమ్మదీయులను కూడా సమాజంలో భాగంగా వేమనగారు చూశారు. "షేకు, సైదు, మొగలు, చెలగు పఠానులు; తురకల దొరతనము తొలుతజేసి, రాగరాగ విడిచి రైతులై కొలిచిరి" అని వారిని సమదృష్టిలో చూశారు. హిందువులకు చేసినట్లే వారికి నీతిబోధ చేశారు.

'మక్కకు జననేల మగుడ దా రా నేల
యేకమైన చిత్త మెందు గలదు
అన్నిట పరిపూర్ణు డల్లా మహమ్మదు

అన్న సత్యాన్ని చాటారు.

"పసులవన్నె వేరె పా లేక వర్ణమౌ
పుష్పజాతి వేరె పూజ యొకటె
దర్శనములు వేరె దైవంబ దొక్కటే"

అని తెలుసుకోమన్నారు.

**37. ఆత్మబుద్ధివలన నఖిలంబు తా నయ్యె**
**జీవబుద్ధివలన జీవుడయ్యె**
**మోహబుద్ధి లయము ముందర గనుగొను**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

ఆత్మఅంతా తానే అయినా జీవిస్తూ ఉండడంవల్ల జీవుడయ్యాడు. అందుకే జీవుడికి సహజమైన మోహాలు లోభాలు సహజం. వయస్సు ముదురుతున్న కొద్దీ మోహం ఎక్కువ అవుతుంది.

"అంగమెల్ల వడలి యట దంతములు వీడి
తనువు ముదిమిచేత తరుచు వడకి
ముప్పతిప్పలైన మోహంబు వీడరు"

అందుకే మోహబుద్ధికి లయాన్ని చూడమంటున్నారు. వయస్సు కాలుతున్న కొద్దీ పడుచుదనంమీదకు వ్యామోహం కలుగుతుంది. కాయకల్పచికిత్స చేయించుకొనడానికి ఉపక్రమిస్తారు.

"ఆకులన్నిదిన్న మేకపోతుల కేల
కాకపోయెనయ్య కాయసిద్ధి
లోకులెల్ల వెర్రిపోకిళ్లు పోదురు"

అని వేమన్నగారు హెచ్చరిస్తున్నారు.

"నూనెలేక దివ్వె నూలున వెలగదు" అయినా
"ఎంత చదువు చదివి ఏనీతి విన్నను
బొగ్గు పాల కడుగ పోవునా మలినంబు"

అని వేమనగారు బాధపడుతున్నారు. తమనీతులు విన్నవారు వాటిని పాటించడం లేదు.

"మాటలెల్ల కల్ల మనసెల్ల కల్లయౌ
నేటి ప్రాణమింక నేటి బ్రదుకు
మాట సత్యమైన మరి శతాయుష్యంబు"

మనిషి పోయినా మాట నిలుస్తుంది.

**38. మరణ మన్న వెరచి మది కలంగగ నేల**
**నిరుడు ముందటేడు నిన్నమొన్న**
**తనువు వీడినతడు తన కన్న తక్కువా**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

జవసత్వాలు తగ్గినప్పుడు జనులు మరణానికి సిద్ధంగా ఉండాలి.

"మంట మింట సందు మన్నవారెందరు?
ఎన్నగాను దరమె యేరికైన?
ఉన్నవారు చావనున్నవారే సుమీ"

భూమికీ ఆకాశానికీ మధ్య బతికినదారెందరు? ఎవరూ లెక్కపెట్టలేదు. బతికున్న వాళ్ళంతా చనిపోవలసినవారే. అయినా,

"తన్ను గన్నవారు, తాగన్నవారును
చచ్చుటెరిగి తాను జచ్చు టెరిగి
తెలియనీదు మాయ దీ నిల్లు పాడాయె"

భ్రాంతి అటువంటిది.

"సకల శాస్త్రములును జదివియు వ్రాసియు
తెలియగలరు చావు తెలియ లేరు
చావు దెలియలేని చదువు ల వేలరా?"

అని చరమదశకు సిద్ధంచేయని చదువును ఈసడిస్తున్నారు. "మరణకాలమునను మది నిల్పు సుజ్ఞాని'. ఆ సమయంలోసైతం "వెనుక గోర్కులకును విలపించునజ్ఞాని" మానవులందరూ "తనువు లస్థిరంబులు, ధర్మము నిత్యము" అని సర్వమానవసమధర్మంకోసం బతికినంతకాలం పాటుపడాలి.

**39. దేహ మనెడి యిల్లు దినదినంబును నూడ్చి
యలికి పూసి మెత్తి యనువు జేసి
కడకు వీడిపోవు కపటిరా జీవుడు
విశ్వదాభిరామ వినుర వేమ.**

పుట్టినవాళ్ళంతా గిట్టవలసినవాళ్ళే. అయినా జీవుడు దేహాన్ని వీడిపోయినప్పుడు బంధువులంతా 'అన్యాయం చేసిపోయాడు' అని విలపించక తప్పదు. దేహం ఇల్లులాంటిది. అందులో జీవిస్తున్నంతకాలం శుభ్రంగా ఉంచుకోక తప్పదు. ఎంత అలికి ముగ్గులు పెట్టిన ఇల్లయినా వీడవలసి వచ్చినప్పుడు వీడక తప్పదు. అంత్యక్రియలు చేయకతప్పదు.

"గాలి గాలి గలిసె, గగనంబు గగనంబు
మన్ను మన్ను గలిసె, మంట మంట

పాంచభౌతికమైనదేహం పంచభూతాలలో కలసిపోతుంది. ఇక మిగిలే దేమిటి? కీర్తి – అందుకే చనిపోయినవారిని కీర్తిశేషులంటారు. మానవుడు –

"ఏమి గొంచు వచ్చె నేమి తా గొనిపోవు
బుట్టువేళ నరుడు గిట్టువేళ?"

అన్నది పెద్ద ప్రశ్న. ఈ లోకానికి వారసత్వంతో నరుడు వస్తాడు. తాను పోతున్నప్పుడు 'తాను ఇచ్చు ఈవి' తన తరువాత లోకంలో వదలిపోతాడు. మనకు వేమన్నగారు ఇచ్చిన ఈవి ఈ వేదం. ఈ ఈవి చిరంజీవి.

**40. నిక్కమైన మంచి నీల మొక్కటి చాలు
తళుకు బెళుకు రాళ్లు తట్టె డేల
చాటుపద్య మిలను చాలదా యొక్కటి
విశ్వదాభిరామ వినుర వేమ.**

సప్తసంతానాలలో కృతి ఒక్కటే శాశ్వతమైనదంటారు. అయితే కృతులలో కూడా సత్కృతి ఒక్కటే నిలుస్తుంది. అందులో కొన్ని పద్యాలే లోకంలో ప్రచారం పొంది జాతిజీవనంలో కలసిపోయి జాతీయాలుగా నానుడులుగా పరిణమిస్తాయి. ఈ సత్యం వేమనగారికి తెలుసు. తాము ఎన్నో సందర్భాలలో ఎన్నో నీతులు చెప్పారు. అందులో లోకంలోని తప్పులెన్నో ఎత్తిచూపారు.

"వేముడిట్లు చెప్పు వేయిపద్యంబులు
తప్పులెన్ని యున్న నొప్పియుండు
బిత్తరి పడకందు బిత్తలై యుండదా?"

అని వారే చెప్తున్నారు. ఆడది నగ్నంగా తిరగటం తప్పే. అయితే రమించేవేళ పడకలో చిన్నది బిత్తలిగా అంటే వివస్త్రగా ఉంటే తప్పులేదు. నగ్నసత్యాలు చెప్పడానికి తాము చేసిన తప్పులుకూడా ఒప్పిదాలే అని వారు చెప్తున్నారు. వారి ఆటవెలదులన్నీ ఒప్పులకుప్పలు. తెలుగునీతికి తెలుగుజాతికి ఆడబడుచులు.

తెలుగు ఎదలో తెలుగుతనం
వెల్లువలా పారాలని
తెలుగింటిలో తెలుగుదీపం
అఖండంగా వెలగాలని
ఈ జాతి నిద్రలేచి
మహోన్నత మానవాదర్శాల వైపు
నిరంతర కృషితో
పయనం కొనసాగించాలనే ధ్యేయంతో
ఉడుతాభక్తిగా యువభారతి కృషి చేస్తున్నది
భాషాభిమానం కలగాలంటే
మాతృభాషా సాహిత్య పఠనమే
ప్రథమ కర్తవ్యం అనే భావం
బలంగా మనసులో నాటుకోవడానికి గాను
వీలైనంత ఎక్కువ మందికి వీలైనంత తక్కువ వెలకు
ఉత్తమసాహిత్యం అందించేందుకు
యువభారతి పూనుకున్నది
ప్రతి తెలుగింటిలో
కనీసం పదయినా తెలుగు పుస్తకాలు ఉండేందుకు
మనందరం ఉద్యమ వేగంతో కృషిచేద్దాం
ఆ పదిమంచి పుస్తకాలలో ఏ ఒక్కటిగానైనా
యువభారతి ప్రచురణ ఏ ఒక్కటైనా
ఉండాలనే ధ్యేయంతో కృషిచేద్దాం

# యువభారతి